

# ప్రముఖాంధ్ర

## ప్రపంచ తెలుగుల మానస పత్రిక

సెప్టెంబరు 2018

సంపుటి : 24 **284** సంచిక : 9




## నీ మధురోహలాంధ్ర లావణ్య భాషారమణీ గళాభరణ సంపద నెంచగ నేనెంత వాడ తల్లీ!

దేశం తెలుగుదే అయితే, భాష మాట్లాడుకోవడం, పరిపాలనం చేసుకోవడం, సంస్కృతిని పోషించుకోవడం, ఆహార ఆహార్యాలనన్నిటా తెలుగుదనం విరిసిపడుతూ ఉండాలి.

ఎందునా, ఏ సందర్భమునా నా జాతి తీసిపోదు. నాది తెలుగు జాతి, నా సంస్కృతి, భాష, సాహిత్యం, సాంప్రదాయం ఆనాదినుంచీ వస్తున్నదని మురిసిపోవాలి. మనల్ని చూచి పొరుగు జనం మురిసిపోవాలి.

ఆనాడు బ్రౌనుగానీ, భారతీయార్‌గానీ మరొకరు గానీ అలా మురిసిపోయిన వారే!

మన తెనుగుభాష ఉండీ, ఆ మాట మాట్లాడే జాతి వుండీ, ఆ జాతి సంస్కృతికీ కాణాచియైన పుడమివుండీ మనం కుదించుకుపోవడం ఏంవిటి? ఒదిగి వేరే భాషీయులు కావడం, వేషధారణ మారడం ఏంవిటి?

మన తెలుగు భాష సరస్వతీ వాగ్విలాసం కదా! శ్రీకాకుళంలోని దేవుడు సహితమూ ఆంధ్ర మహావిష్ణువునని చెప్పుకున్నాడే! అంతటితో సరిపెట్టాడా తన్ను దర్శించవచ్చిన కృష్ణ దేవరాయల్ని–"ఓ కృష్ణరాయా! తెలుగులో కవిత్వం వ్రాయుము, గ్రంథ రచన చేయుము. "ఏను తెలుగు వల్లభుడనంటే సరిపోదు – కవితా వల్లభుడవు కమ్ము! కవులకు వల్లభుడవు కమ్ము, కవులను పోషించు, కవితను పోషించు. రాజ్యాలు జయించి, రాజ్యవిస్తీర్ణత పెంచి, సమరాంగణా చక్రవర్తిననిపించుకోవడంతో సరిపెట్టుకోకు! సాహితీ సమరాంగణా చక్రవర్తిననిపించుకో" అన్నాడు! అప్పుడే కదా ఆయన 'ఆముక్తమాల్యద' వ్రాశాడు. పెద్దన్నచే 'మను చరిత్ర' రచింపచేశాడు. తరువాత పెద్దన్నను పల్లకీలో ఊరేగించి, ఓ కొమ్మును భుజాన కాశాడు. ఇలా భాషను ఆలించి పాలించిన పాలకుల దాఖలాలు కనపడడం లేదు. భాషను బట్టి జాతికి, జాతిని బట్టి దేశానికీ గౌరవం వస్తుంది. కావున ఇంటాబయటా మాతృభాషను పెంచడానికి ప్రయత్నించండి. ఏ దేశమేగినా, మన తెలుగువారు ఎదురైనప్పుడు మన భాషలోనే మాట్లాడండి. మన సంస్కృతీ సంపదలనే చర్చిస్తూ ఉండండి. అలా చేసేవారిని మాత్రమే ప్రోత్సహించండి.

మన భాషను గురించి ఎంత చెప్పినా అంత తక్కువే అవుతుంది. అలాటి మధురమైన భాష మనది, మంజులమైన భాష మనది. అలాటి మధురమైన భాషను గురించి ఇంకా ఇంకా చెప్పాలి. పన్నెండేళ్లుగా చెబుతూన్నాను.

నీ మధురోహలాంధ్ర లావణ్య భాషారమణీ! నీ గళాభరణ:
పద సంపద నెంచగ నేనెంతవాడను తల్లీ!
నీ పాదారవింద చరణములకు ప్రణతులర్పిస్తూంటానమ్మా!



బుధజన విధేయుడు

– గోటేటి శ్రీరామారావు


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



# ఆంధ్రుల ఉన్నతీ, ఉనికీ, సంగీత, నృత్య, సాహిత్యము, ఉధృతిలన్నింటికీ తంజావూరు ప్రామాణికంగా నిలిచింది!!

**1600** సం॥ము నుంచీ ఆంధ్ర ప్రాంతములో రాజకీయ పతనమేర్పడింది; సంగీత, సాహిత్య పోషణము క్షీణిస్తూ వచ్చింది.

ఒక ప్రక్కన సూర్యుడు అస్తమిస్తుంటే, అదే సమయమున మరో పార్శ్వమున సూర్యుడుదయించుననునట్లు దక్షిణాపథములోని తంజావూరులో 1614 –1633 ప్రాంతములో రఘునాధరాయలు పాలన ఆంధ్రులకు స్వర్ణయుగం. ఆయన 1614 నుంచీ 1633 వరకు పాలించిన కాలముననే తంజావూరులో ఆంధ్రుల భాష, ఔన్నత్యమూ, కళలూ, సంస్కృతీ ప్రవర్ధిల్లింది. శుక్లపక్ష చంద్రునిలా తెలుగు వెలుగులు కాన్తిలో క్రాన్తులుగా భాసిల్లినవి.

తరుష్కుల దురంతములు అరికట్టబడినవి. యుద్ధములకు సన్నద్ధులైనవారు సహితమూ, రాజ్యములోకి చొరబడుటకు సాహసించలేకపోయారు. దొరలివచ్చిన వారిని రఘునాధ నాయకుని సైన్యం వీరోచితంగా తరిమికొట్టింది.

ఆయన పాలనా కాలములోనే దక్షిణాపథములో తెలుగు యక్షగానాలు వృద్ధి నొందాయ్! నాటకములు, సంగీత, నృత్యకళలు ప్రఖ్యాతిగాంచినవి. తదితర తెలుగు ప్రాంతాలవారు తమ పూర్వులు నిర్మించిన శిల్పాలు శిథిలమవుతున్న తరుణంలో – రఘునాధ రాయలు వాటిని నిలుపడమే గాకుండా, చక్కని శిల్ప సౌందర్యము కల దేవాలయములుగా తీర్చిదిద్దారు. పెక్కు రాజభవనాలనూ, కోటలనూ నిర్మించారు.

రఘునాథరాయలు సంగీతప్రియుడు. ఆయనే సంగీత సుధానిధి. ఆంధ్రభారతి! ఆ రాజ్యమున ముత్యాల పల్లకీలో ముత్యాల సరములతో మధుర మంజుల స్వరములను పలికించే ఒక వీణను కనిపెట్టారు. ఆ వీణను రఘునాథ మేళ అనేవారు. రఘునాధ రాయల కాలంలోనే 64 కళలూ చతుష్షష్టి కళలూ పోషింపబడ్డాయ్. చక్కని సాహిత్యం ప్రోత్సహించబడింది. ఓ చక్కని గ్రంథాలయం ఏర్పడింది. అటువంటి అత్యున్నత వైభవమంతా ఆనాటి ఆంధ్ర పాలకుని కాలంలోనే జరిగినవి. అటు తరువాత పూర్వాచారములూ, సంప్రదాయ ములూ నశించిపోయినట్లు అడిదం సూరకవి ఈ క్రింది పద్యం ద్వారా తెలుస్తుంది.

*"అగ్రహారములు నామా వశిష్టములయ్యె*
*మాన్యంబులన్నియు మంట గలిసె*



**రఘునాధరాయల కాలమున తురుష్కుల ఆక్రమణలు గానీ, యుద్ధములుగానీ, అకస్మాత్ దండయాత్రలు, యుద్ధములుగానీ సాగలేదు. వాళ్ళందరినీ తరిమి తరిమి దూరముగా నెట్టినవి. భారతీయ సంస్కృతి, ఆంధ్ర దేశ కళలు, సాంప్రదాయములు వెల్లివిరిసినవి. యక్షగానాలు వృద్ధికి వచ్చాయ్. వీధి నాటకాలు, వేదిక నాటకాలు, నృత్యములు, సంగీతము వృద్ధి పొందినవి. రఘునాధరాయలు తరువాత పాలనమునకు వచ్చిన ఆయన కుమారుడంతటి వీరుడు కాడు. తంజావూరు పాలనను కోల్పోయాడు. ముసల్మానులకు మంచి అవకాశం కలిగింది. వారి నీడలు క్రమేణా తంజావూరు రాజ్యమంతా ప్రబలినవి. కవితలలో పారశీకత, పార్శీ పదాలు తెలుగు భాషా పదాల్లో మిళితమయ్యాయ్. భాష సంకరమైంది. సామంతులవలె చిల్లర చిల్లర పాలెగాళ్ళు గద్దెనెక్కారు. వారి అధికార బలక్షీణతతోబాటు కళలు అన్నియు అస్తమించిపోయాయి. అక్కడక్కడ గ్రంథాలయములు, గ్రంథ పఠనము జరుగుతూండేవి. దేశభాషా సాంస్కృతిక విలాసమైన సాంప్రదాయం సాహిత్యము 16వ శతాబ్దానికే క్షీణస్థితికి వచ్చినవి.**

*భత్యంబునకు దొంటిపడి కట్లు తప్పెను*
*బుధజనంబుల రాకపోక లుడిగిపోయె*
*వర్ణాశ్రంబులు వరదల పాలైపోయె*
*మలవతీలను ప్రజలే చూసి చనిరి!*
*నశించిపోయె వంతరులు తురుష్కులు*
*గజతురంగములు తాకట్టుపడియె!*
*ధార్మిక స్థానమున కిట్టి తుళ్లు బట్టె*
*కఠిన చిత్తుని రాజ్యాధికారి జేసె*
*యింత పీడించితివి సత్యవీంద్ర కోటి*

**– అంటూ బాధపడ్డాడు.** రఘునాధరాయల కాలమున తురుష్కుల ఆక్రమణలు గానీ, యుద్ధములుగానీ, అకస్మాత్ దండయాత్రలుగానీ, యుద్ధములుగాని ఎదగలేదు. వాళ్ళందరినీ తరిమి తరిమి దూరముగా నెట్టాడు.

భారతీయ సంస్కృతి, ఆంధ్ర దేశ కళలు, సాంప్రదాయములు వెల్లివిరిసినవి. యక్షగానాలు వృద్ధికి వచ్చాయ్. వీధి నాటకాలు, వేదిక నాటకాలు, నృత్యములు, సంగీతము వృద్ధి పొందెనని ఇదివరకే చెప్పుకున్నాం. రఘునాధరాయలు తరువాత పాలనమునకు వచ్చిన ఆయన కుమారుడంతటి వీరుడు కాడు. తంజావూరు పాలనను కోల్పోయాడు.

ముసల్మానులకు మంచి అవకాశం కలిగింది. వారి నీడలు క్రమేణా తంజావూరు రాజ్యమంతా ప్రబలినవి. కవితలలో పారశీకత, పార్సీ పదాలు తెలుగు భాషా పదాల్లో మిళితమయ్యాయ్. భాష సంకరమైంది. సామంతులవలె చిల్లర చిల్లర పాలెగాళ్ళు గద్దెనెక్కారు. వారి అధికార బలక్షీణతతోబాటు కళలు అస్తమించిపోయాయి. అక్కడక్కడ గ్రంథాలయములు, గ్రంథ పఠనము జరుగుతూండేవి. దేశభాషా సాంస్కృతిక విలాసమైన సాంప్రదాయం సాహిత్యము 16వ శతాబ్దానికి క్షీణస్థితికే వచ్చినది.

ఆంధ్ర సంస్కృతి, సాంఘిక స్థితి 1600 సం॥ము నుంచీ 1757 సం॥ము వరకు గల 157 సం॥ములు స్థూలముగా ఉండెనన్న నూటికి నూరుపాళ్ళు సత్యము సత్యమైనది.

తురుష్కులు పాలనావకాశమును ప్రధానంగా చూచుకోలేదు. తమ వెంట బంగారము, వెండి, ధనరాశుల్ని పట్టుకుని పోవడమే పనిగా పెట్టుకున్నారు. ప్రసిద్ధ ఆలయాల సంపదను కొల్లగొట్టడమో, వాటి మీదుగానే స్థలాక్రమణ చేసి మసీదులు కట్టడమో చేసారు. వీలైనంతమందిని తమ మతములో బలవంతముగా కలుపుకున్నారు. ఇప్పటికీ కాశీ, మధుర, అయోధ్యల్లో అలాటి ఆక్రమణలను దర్శించగలం.

అటు తరువాత, పాశ్చాత్యుల రాకతో– హైందవ స్వరూపం నిముష నిముషానికి కోల్పోతూ వచ్చింది. కాశ్మీరము నుంచి దిగువ కన్యాకుమారి వరకు గల హిందూమతంపై క్రైస్తవ మత ప్రభావం చిగురులు తొడుగుతూ వచ్చింది.

హిందువుల్లోగల ఘోరమైన కులబేధాల్ను, క్రైస్తవులు బాగా గ్రహించారు. 500 మైళ్ళ సుదూర ప్రయాణం చేసి ఏతోడూ లేకుండా సప్త సముద్రాలను దాటివచ్చినవారు. అటవికుల భాషను నేర్చారు. అంటరానివారిగా ఉన్నవారిచే ఆకర్షింపబడ్డారు. వారికి ఉచిత విద్యాబోధన, వైద్య చికిత్సాలయాలు ప్రారంభిస్తూ వచ్చారు. గ్రామగ్రామాన, పల్లె పల్లెల్లోనూ, ప్రార్థనాలయాలు (చర్చిలు) నిర్మించారు. ఆర్థిక హార్థిక సహకారం చేస్తూ క్రీస్తు ప్రచారం చేస్తూ రావడమొక కారణమైతే, ఊరికి పొలిమేరల్లో వేర్పాటుగా ఉన్నవారిని అక్కున చేర్చుకోవడంతో క్రైస్తవం విస్తరించింది. కాలమానాన్ని మారిపోయేటట్లు చేసింది. క్రీ.పూ (క్రీస్తు పూర్వం), క్రీ.శ. (క్రీస్తు శకము)లే కాల నిర్ధారణ చేస్తున్నాయ్. సంవత్సరంపేరు కూడా అంకెల్లోనే చెప్పబడుతున్నాయ్.

ముఖ్యంగా ఔత్తరాహుల కన్నా, దక్షిణాత్యులే యెక్కువగా ఈ ప్రభావ, ప్రవాహంలో ఉన్నారు. మతాచార్యుల మడులదడులూ, కొంతకాలం వరకూ కొన్ని ఆలయాల్లో వెనుక వర్గాలవారికి కల ప్రవేశ నిషిద్ధం, యిందుకు ప్రధాన కారణమైంది. పలు దేశాల్నుంచీ క్రైస్తవ మత విస్తరణ కోసం వరదల్లా ప్రవహిస్తున్న ధనం ప్రధాన కారణమయింది.



ఆంధ్ర కేసరి విగ్రహం పోర్టు రైల్వేస్టేషన్ కూడలిలో ఉన్నది.



చిత్తూరి నాగయ్య విగ్రహం పానగల్ పార్కులో ఉన్నది.

కులమతాచారాల కట్టుబాట్లతో ఆర్య ధర్మం దెబ్బతిన్నది. విక్రమాదిత్య శకం, శాలివాహన శకం – అన్న మాటలన్నీ మరుగన పడిపోయాయ్. పోనీ భారతీయత ఏమైన వర్ధిల్లిందా అంటే వర్ధిల్లేదు సరికదా దిగజారుతూ వచ్చింది.


ఆర్యసంస్కృతిని ఆర్య సంస్కృతి అన్నారు. ఆర్యులు యెక్కణ్ణుంచో వచ్చారనీ, ద్రవిడులే ఇక్కడి వారనే ప్రచారం జరిగింది. ఈ విషయంలో ముఖ్యంగా దెబ్బతిన్నది ఆంధ్రులే. అందుకు తగినట్లుగా జరిగిన భాషోద్యమం కారణంగా – కొందరు తెలుగువారు తమిళనాడులోనూ, ఒరిస్సాలోనూ, కర్ణాటకలోనూ ఉండిపోవడంతో తెలుగువారిలోని తెలుగు భాష క్రమశః తగ్గిపోయింది. ముఖ్యంగా తెలుగు జీవనాడియైన చెన్నపట్టణం తెలుగువారిది కానిదవడం భాషా ఉనికికి శరాఘాతమైంది.


తంజావూరు తరువాత చెన్నపట్టణమే రెండో ఊపిరి తిత్తి వంటిది. చెన్నపట్టణం పుట్టుకకు పునాదులు వేసింది తెలుగువాడు. తొల్తపుట్టినవాడు తెలుగువాడు; తొల్త ఏలినవాడు తెలుగువాడు. తొల్త వ్యాకరణం, వాచకం, పెద్దబాలశిక్ష కూడా యిక్కడ పుట్టినదే! వాల్మీకి రామాయణం తెలుగు గ్రంథాన్ని వావిళ్ళవారు ప్రచురించి, విడుదల చేసినపుడాప్రతులను గజారోహణంగా తండయార్పేట నుంచీ బ్రాడ్వే వరకూ వీధుల్లో ఊరేగించారు. పిట్టి త్యాగరాజచెట్టి విగ్రహం యిప్పటికీ కార్పొరేషన్ భవనం వద్ద ఉంది కానీ, మద్రాసు ప్రీమియర్‌గా (అప్పటి ముఖ్యమంత్రిగా) పనిచేసిన ధీరుడు ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులు గారి విగ్రహం యెక్కడో పోర్టు రైల్వేస్టేషన్ వద్ద ఉంది. ముఖ్య ఉత్సవాల్లో తప్ప ఆ విగ్రహము శిరముపై గల కాకిరెట్టలు తుడిచేవారుండరు.

ఒకప్పుడు తమిళ తెలుగు సినిమా రంగాల్లో నాయక పాత్రలు ధరించిన జి.యన్. చెట్టి కూడలిలో త్యాగబ్రహ్మగాన సభకు స్థలక్రయం చేసి, వాణీమహల్ నిర్మించిన చిత్తూరు వి. నాగయ్య విగ్రహం అక్కడి కూడలిలో లేదు. పానగల్ పార్కులోని ఒకమూల ఉన్నది. విగ్రహంపై కాకిరెట్టలు పడుతూ ఉంటుంది.

ఆంధ్రుల ఉనికికి, ఉన్నతికీ, సంగీత, సాహిత్య ఉన్నతికీ, స్థాపనకూ కారణమైన చెన్నయ్ మహా నగరములో తెలుగువారి ఉనికిని పోగొట్టుకున్నట్టుగా ఉంది. ఇవన్నీ తెలుగువారి స్వయంకృత అపరాధాలూ రోగాలు! భాషా రాష్ట్ర విభజన ఘోషగా జనించిన పాపం. ●



# శ్రీవిజయదుర్గా పీఠం 46వ వార్షికోత్సవములు వైభవంగా జరిగాయ్!

## ఒక ధార్మిక సంస్థను నెలకొల్పడమెంత కష్టమో అద్దానిని నిర్వహించడమూ అంత కష్టమే!


**1972** సం॥ము ఆగస్టు 18వ తేదీన తూర్పు గోదావరి జిల్లా మారుమూల గ్రామం వెదురుపాకలో శ్రీగాడ్‌గారు విజయదుర్గా పీఠమును నెలకొల్పారు. స్వయంశక్తి స్వరూపిణీగా విజయ దుర్గాదేవి స్వయంభూరూపిణిగా అక్కడ పరమభక్తాగ్రేసరులూ, దైవస్వరూపులైన గాడ్‌గారి సువిశాలమైన భవనంలో అవతరించింది. అమ్మహా తల్లి అవతరించడమే అష్ట భుజములతో వ్యాఘ్రవాహినిగా అవతరించడం వెదురుపాక గ్రామస్థుల పుణ్యఫలం. ఆనాడు శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతపు పుణ్యదినం.

విజయదుర్గా పీఠాధిపతులుగా వాగ్దేవు వంశీకుల తపఃఫలమై పుట్టీ పుట్టడంతో 'గాడ్'గా పిలువబడిన పుణ్యపురుషుడాయన! ఒకరకంగా చెప్పాలంటే ఆయన అవధూత. చతుర్భుజుడు గాకపోయినా, చతుర్భుజాలతో అష్టభుజియైన అమ్మవారికి అర్ధరాత్రి సమయంలో నిష్టాగరిష్ఠుడై కుంకుమ పూజను చేస్తారు. ఆ కుంకుమ సకల దోష నివారిణి. సకలౌషధ సంజీవని. తొలిసారి నేను దర్శించినపుడు మా మరదలు చి॥సౌ॥ ప్రభావతికి ఎడతెరపి లేకుండా వాంతువులున్నాయ్. ఈ విషయాన్ని గ్రహించిన పూజ్యశ్రీ గాడ్‌గారు ఆవిడ నోట అమ్మవారి కుంకుమను గుప్పారు. అంతే – క్షణంలో వాంతులన్నీ కట్టాయ్. నాలుగు దశాబ్దాలు గడిచినా, ఇప్పటి వరకూ ఆవిడకు వాంతియనేది రాలేదు. నా జీవితంలో కూడా ఇలా ఎన్నో నిదర్శనాలున్నాయ్.

'గాడ్'కు యివ్వడమేగాని పుచ్చుకోవడం ఉండదు. ఆయనకు చేసే ఒక్క నమస్కారం వెయ్యి పుణ్యాలపెట్టు. ఆయన పంపే పూజా కుంకుమను పెట్టుకుంటే రుగ్మతలన్నీ కట్. ఎప్పుడాయన పీఠం నుంచీ కుంకుమ ప్రసాదం వస్తుందాయని ఎదురుచూస్తుంటాను. వృద్ధాప్యం వచ్చిన తరువాత వెదురుపాక వెళ్ళడమే కుదరలేదు. ఆయన రప్పించుకోవాలనుకుంటే రప్పించుకునేవారేమో! అవసరం లేదనుకుని రప్పించుకోవడం లేదు! కానీ పూజా కుంకుమలు ఎప్పుడు వస్తాయాయని ఎదురుచూస్తూ వుంటాను. వచ్చిన కుంకుమ ప్రసాదాన్ని మరు ప్రసాదం వచ్చేవరకూ భద్రపరచుకుంటూంటాను. విజయ దుర్గాదేవీ అనుగ్రహమూ, నిరతమూ ఉన్నదనే విశ్వాసమే నన్ను నడిపిస్తూన్నది. ఆగస్టు 16, 17, 18 తేదీల్లో జరిగే విజయదుర్గా పీఠ వార్షికోత్సవాల్లో ప్రత్యేకంగా పాల్గొంటున్నట్లుండే అనుభూతి కలుగుతూంటుంది! పీఠదేవతా అనుగ్రహమూ, గాడ్‌గారి పీఠం కుంకుమ ధారణం ఉన్నంతవరకూ ఏ లోటూ ఉండదని నా విశ్వాసం. ఈ విశ్వాసం దెబ్బతినకుండా ఉండాలని వారి పాద యుగళికి ప్రార్థిస్తూంటాను! ఎంతో పుణ్యం చేసు కున్నవారికి గానీ, 'గాడ్' గారి మదిలో ఉన్నవారికే ఈ పుట్టిన రోజు పండుగ చూసే అవకాశం ఉంటుంది.

చంద్రుణ్ణి దర్శించాలనే చకోరంవలె గత మూడు సంవత్సరాలుగూ గాడ్ గారి పుట్టిన రోజు వేడుకలకు వెళ్ళాలని చూస్తున్నాను. కానీ వెళ్ళలేకపోతున్నాను. అంటే వారి ఆజ్ఞ లేదోమో, తప్పక వెళ్లి వారిని దర్శిస్తాననెడి ఆశ ఉంది;ˇర్శింపచేస్తారనెడి విశ్వాసమూ ఉంది. ●

# సర్దార్ వల్లభాయ్ పటేల్ ధీరత్వానికి సరిగలవారెవ్వరూ?



దేశంలో పలు స్వతంత్ర పాలిత ప్రాంతాలను హిందూ దేశ సార్వభౌమాధికారానికి లోబడేటట్లు చేసిన ఏకైక ధీరుడు!

తాను ఉప ప్రధానిగా ఉంటూనే కొరకరాని కొయ్యగా ఉన్న నైజామును భారత రిపబ్లిక్ యూనియన్‌లోనికి తీసుకుని వచ్చిన ధీరాధిధీరుడు. రాత్రికి రాత్రి నిజాము సైన్యాన్ని పంపి నిజాము చక్రవర్తి కోరలను పీకి వేసాడు. భారత రిపబ్లిక్‌లో నిజాము లీనమయ్యేట్లు చేసిన ధీరుడు.

అన్ని స్వదేశీ సంస్థానాల పాలనను హిందూ దేశ రిపబ్లిక్ యూనియన్‌లో లీనమయ్యేట్లు చేసిన ఘనత ఒక్క వల్లభ బాయ్‌దే! పటేల్ జన్మించిన అక్టోబర్ 31 ని జాతీయ ఐక్యతా దినంగా ప్రకటించడం- ప్రధాని నరేంద్ర మోదీ విజ్ఞతకు నిదర్శనం!

పటేల్ భారత తొలి ప్రధాని పదవి చేపట్టి ఉంటే భారతదేశం రెండుగా చీల్చబడి ఉండేది కాదు. హిందూ మత ద్వేషాలు ప్రజ్వరిల్లేవి కావు. మేరా భారత్ మహాన్ నినాదం బలిష్టమయ్యేది. అన్య మతస్థుల ఆటలు కట్టుదిట్టంగా కట్టబడేవి. దురదృష్టమల్లా పటేల్ ప్రధాని గాకపోవడమే! ఆస్తిక భావంలేనివారు రాజ్య పరిపాలకులు కావడంతో భారతదేశంలో ఆస్తికభావాలు క్షీణిస్తూ వస్తున్నాయ్. ఆస్తిక అశక్తత కారణంగా భారతీయులు ఆస్తిక పూర్ణ సిద్ధాంతానికి చేరువ కాలేకపోతున్నారు.

అప్పటి ఇప్పటి పరిస్థితులను చూస్తుంటే, డెబ్బై ఏండ్ల క్రితం ఆలపించిన 'భారతదేశం మనదే కానీ, ఫలితం మనకేదీ' అన్న ఆవేదనా పూరిత గేయం నా మనసును గాయపరుస్తూనే ఉంటుంది.


ఎన్నటికీ నా దేశం 'నా భారత దేశం' అనే పూర్ణ నినాదం చేసేవారు మనకు దొరుకుతారు? లేదా 'భారతదేశం మనదే కానీ ఫలితము మనకేదీ' అని ఆలపించిన ఆనాటి గీతమే నానోట పునరావృతమవుతుందా భారతమాతా చెప్పవమ్మా ఈ తరం నోటా ఆ భావన కల్గించమ్మా, ఆ భారత మాతనే ప్రార్థిస్తున్నాను.

## ముని మాణిక్యం నరసింహారావు గారి నుంచీ మొన్న మొన్నటి ము.కరుణానిధి వరకూగల పత్రికా రచయితలందరూ హాస్య ప్రియులే!

ఒకసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరుణానిధి మాట్లాడుతూ - నేను కరుణానిధినే! గానీ, కరుణ ఉన్నది గానీ, నిధి లేదన్నాడు.

చమత్కారంగా మాటలను మాట్లాడటంలో రాజకీయ నాయకులది అగ్రస్థానం. వారిని తలదన్నేవారుండరు.

ఓ రాజకీయ నాయకుడు తల తడుముకుంటూ ఏముందో చూసారా- అంటూ బోడితలను చూపించాడు. వాటినే బోడి తెలివితేటలనుకోండీ, ఏమైనా అనుకోండి! పత్రికా రచయితలు మాత్రం వాటిని బోలెడు తెలివితేటలుగా తలపోస్తారు. పత్రికా రచయితలే రాజకీయ నాయకులైతే చెప్ప పనిలేదు.



తమిళనాడు రాజకీయాల్లో ఒక వృద్ధ తరం నాయకుణ్ణి తమిళనాడు కోల్పోయింది.

ఆయన ము. కరుణానిధి. అణ్ణాదురై వద్ద రాజకీయాభ్యాసం చేసి, రాజకీయాల్లో రాటుతేలాడు. ముఖ్యమంత్రి పదవి నధిష్టించాడు.

తమిళ రాజకీయాల్లో రాటుతేలిని ద్రవిడ నాయకుడు, తెలుగువాడు తెలుగుతనం బయటపడకుండా తమిళ రాజకీయాల్లో ద్రవిడ ఉద్యమాల్లో ప్రత్యేకతను కల్పించుకున్నాడు. ప్రత్యర్థులను చిత్తుచేసాడు. 94 సంవత్సరాలు జీవించాడు. అధికమాసాలను కలుపుకుంటే నూరు సంవత్సరాల నిండు జీవితం పండించుకున్నాడు. రాజకీయ రంగంలో కురువృద్ధుడు. చేయని సమరం లేదు. సిద్ధించని విజయం లేదు. పూర్ణ జీవితం అనుభవించాడు. తన రాజకీయ పూర్వులందరూ ఖననం చేయబడిన చోటనే ఖననం చేయబడ్డాడు.

కరుణానిధి మరణంతో తమిళనాట ఓ కురువృద్ధ రాజకీయ శకం ముగిసింది. ద్రవిడోద్యమాన్ని చివరికంటా తీసుకుని వెళ్ళి, విజయం సిద్ధింపచేసిన ఘనుడాయన. ద్రవిడ చరిత్ర ఉన్నంతవరకూ కరుణానిధి చరిత్ర ఉంటుంది. చిరస్థిర చరిత్ర కల్పించిన వారిలో కరుణానిధి అధ్యాయం చెరగని అక్షరాల సముచ్చయం. ఆయన తెలుగు వాడని చాలామందికి తెలియదు. కాని ఒంగోలు వద్దనున్న ఓ కుగ్రామం ఆయన గ్రామమని ఆయనే చెప్పాడు. తమిళ ద్రవిడ నాయకుల మూలాలన్నీ తెలుగువే!

# కొండలను నిలిపిన కొండంత దేవుడా శివుడు!




**- మూడు ప్రసిద్ధి పొందిన శివాలయముల మధ్యనున్న మన తెలుగుదేశాన్ని త్రిలింగదేశమన్నారని ఎందరికి ఎరుక?-**

కొండలను నిలువరించాడు కావున అక్కడున్న శివుణ్ణి అచలేశ్వరుడన్నారు. ఆరావళీ పర్వతశ్రేణులు కదల కుండా అక్కడ వెలసిన శివుడు పట్టినిలిపాడట. అది కూడా ఆయన బొటనవేలితోనే నిలిపాడు.

అన్ని శివాలయాల్లోనూ ఉన్నట్లు ఇక్కడ శివలింగం ఉండదు. వలయాకారంగా సొరంగం ఉంటుంది. లోపల ఒక బొటన వేలులా కనిపిస్తుంది. అది శివుని కాలిబొటన వేలు అంటారు. ఆరావళీ పర్వతశ్రేణి ఎక్కడకూ కదలిపోకుండా శివుడు కాలిబొటనవేలుతో అదిమి పట్టాడు. చలన లక్షణం గల పర్వతాలను శివుడు చలనం లేకుండా చేసినందును ఆ పర్వతాలను అచలం అని, నిలువరించిన శివుణ్ణి అచలేశ్వరుడనీ అంటారు. శివుని బొటన వేలు ఉన్న సొరంగం ఆ కొండల మీద నుంచీ పాతాళం వరకూ ఉందంటారు. ఆ సొరంగాన్ని నీళ్ళతో నింపడానికి ఆరు నెలలు పట్టినదట.

**స్థలపురాణం విచిత్రంగా ఉంటుంది.** వశిష్ట మహాముని తపస్సు చేస్తున్న కాలంలో ఒక గోవు సొరంగంలో చిక్కుకుని పోయిందట. గోవును బయటకు తీయడానికి సాధ్యం కాని మునివర్యుడు ముందు ముందు ఇలాంటి విపత్తు కలుగకుండా ఉండటానికి ఆ సొరంగాన్ని పూర్తిగా నింపమని కోరతాడు. శివుడి సలహాతో హిమాలయాధీశ్వరుని కుమారుడు సహాయం చేస్తాడు. ఆ ఆలయంలో పంచ లోహాలతో తయారు చేసిన ఐదుటన్నుల బరువైన నంది విగ్రహం ఉన్నది, ఆ ప్రక్కన పిల్లవాడున్నాడు. ఆ పిల్లవాడే హిమాలయీశుని పుత్రుడంటారు. ఆ ఆలయం ప్రక్కన ఓ తటాకం ఉన్నది. దాని ఒడ్డున మూడు రాతి గేదెలున్నాయ్.

ఈ రాతి గేదలకు కూడా స్థానికంగా ఇంకో కథ ప్రచారంలో ఉన్నది. అక్కడ నేతి తటాకం ఉండేది. ముగ్గురు రాక్షసులు గేదెల రూపంలో తటాకంలోకి దిగి, నేతిని అపరిశుభ్రం చేసేవారు. ఆ రాజ్యాన్ని పాలిస్తున్న రాజు ఆ ముగ్గురు రాక్షసులను బాణాలతో సంహరించాడని చెబుతారు. దానికి ప్రతీకగా తటాకానికి ఒక ఒడ్డున రాతి గేదెలు మరో ఒడ్డున రాజు శిలారూపాలున్నాయి. ●



రాక్షసులకు ప్రతీకలుగా రాతి గేదెలు

*అచలేశ్వర ఆలయాన్ని తొమ్మిదవ శతాబ్దంలో పారమార రాజవంశస్థులు నిర్మించారు. ఆలయానికి ఒక వైపు కొండమీద గుహ కనిపిస్తుంటుంది. దానిని గోపీచంద్ గుహ అంటారు. రాజ కుటుంబానికి చెందిన గోపీచంద్ సన్యసించి ఆ గుహలో ధ్యానం చేసేవారట. రాతి గేదెలున్న తటాకానికి పక్కనే ఓ కొండ. ఆ కొండమీద ఒక కోట ఉంది. ఈ కోట పారమార రాజవంశం నుంచి 15వ శతాబ్దంలో మేవార్ రాజు మహారాణా కుంభా స్వాధీనంలోకి వచ్చింది. రాణా కుంభా ఈ కోటకు అచలేశ్వరమహాదేవ్ పేరు మీద అచల్ఘుర్ అని పేరుపెట్టి మరికొన్ని నిర్మాణాలు చేశారు. ఆ తర్వాత వచ్చిన మేహార్ రాజు రాణా సంగా కోటను పటిష్టం చేశాడు. ఇప్పుడది శిథిలావస్థకు చేరింది. ఆలయం, కోట ఉన్న ఆ ప్రదేశాన్ని అచల్గఢ్ అని పిలుస్తారు. మౌంట్ అబూ పట్టణానికి 11 కి.మీ.ల దూరంలో ఈ గుహ ఉంది.*

*Lovely Stay at Holy Tirupathi*   *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels@yahoo.co.in, Grams :**

## వివేకం లేని బుద్ధి! నిలకడలేని మనస్సు! పవిత్రం కాని చిత్తం! తానే గొప్పనే అహంకారం పై చతుష్ట దుష్ట భావాలను త్యజించిన మహా మనిషి

# వరప్రసాదరెడ్డి!



స్వప్నావస్థమునందు గోచరించే ప్రపంచం. జాగ్రదావస్థలో పంచేంద్రియాలు దర్శించే దృశ్య ప్రపంచం ఒకటి కావని గ్రహించాడాయన.

పవిత్రతలేని చిత్తం, తానే నేను అనుకునే చపలత్వం, స్వప్నంలో ఎంత ఎదిగాననే అహంభావం, నిద్రానంత రం గోచరించే నిజస్థితి, భోగ, భోజ్య, భాగ్యాల సుఖాల వెంట పరుగిడని మహా మనిషి.

చపలత్వం కారణంగా చంచలత్వం కలుగుతుంది; చంచలత్వం కారణంగా మోహం రేగుతుంది. మోహం కారణంగా వ్యామోహం పేట్రేగుతుంది. వీటివేటినీ దరికి చేరకుండా తరిమి గొడుతున్నగొప్పవాడు, వరప్రసాదరెడ్డి. శాంతాకాంత తనయుడు,

శాంతా బయోటిక్ సంస్థ అధిపతి. ఆయన తెలుగువారి వర ప్రసాదుడు. రుగ్మతలను బాపే టీకాలను కనిపెట్టాడు. శ్రీమంతుడయ్యాడు. కానీ ఆయనెపుడూ శ్రీమంతుడనని భావించడు. నిరంతర శ్రమనూ, నిర్విరామ కృషీత్వం గల పరిశ్రమను నెలకొల్పి శ్రమంతుడిగానే జీవిస్తున్నాడు. శ్రమించేవారి కోసమే పాటుపడుతున్నాడు.

భాగ్యనగరం ఆయన నివాసం. ఆయన తన భాగ్యసౌభాగ్యములన్నిటినీ ప్రోది చేసి తిరిగి ప్రజలకే సమర్పిస్తున్నాడు.

శ్రమ ఆయనిది. పరిశ్రమల సౌభాగ్యం ప్రజలది. ఆచరణ ఆయన సొంతం! ఆదరణ ప్రజల సొంతం! ఏది సత్యమనుకుంటాడో, ఆ సత్యానికే శ్రమిస్తాడు. ఏది జీవితాన్ని క్రమశిక్షణతో నడుపుతుందని భావిస్తాడో, ఆ క్రమశిక్షణకే అంకితమవుతాడు.

తనువిచ్చిన అమ్మ ఆయన ఆరాధ్య దైవం. అలాంటి వయసు అమ్మలందరినీ, అమ్మ పుట్టిన రోజున పిలిచి, పూలూ, పండ్లు, పసుపు, కుంకుమ నూతన వస్త్రములిచ్చి సత్కరిస్తాడు. అందరిలోనూ తన అమ్మనే చూస్తాడు. శారదమ్మను తల్లిగా భావించి ఆరాధించిన వివేకానందుడు. భరతమాత ఖ్యాతిని దశదిశలా వ్యాపింపచేసిన వివేకానందుడి తోడనుకోవాలా? దేశాన్నుద్ధరింపచేసిన దేశోద్ధారకుడనుకోవాలా? ఏమనుకోవాలి? ఎంత పరిధిలో చెప్పుకోవాలి? – అన్నది నా మేధస్సుకు అందని విషయం!

శాంతా బయోటిక్సు – పేరులో సొంతమూ శాంతమున్నది; సారస్వమూ ఉన్నది. దేశమనియెడు దొడ్డ వృక్షము ప్రేమయనెడు పూలెత్తవలెనోయ్– అన్న గురజాడ సారస్వమూ ఉన్నది. పొగడరా నీ తల్లి భూమి భారతినీ, నిలుపరా నీ జాతి నిండు గౌరవంబు– అనే రాయప్రోలువారి మాటను అక్షరాలా పాటించే లక్ష్మణమూ ఉన్నది. గతమెంతో ఘనకీర్తికలవాడా, చేయెత్తి జైకొట్టరా అన్న వేములపల్లివారి కీర్తి పతాకను ఎల్ల వేళలూ ఎగురవేసే స్వభావమూ ఉన్నది. ఇలా ఇలా చెప్పాలంటే ఎందరో దేశభక్తులను ఆకళింపు చేసుకుని, ఆచరిస్తున్న ఆదర్శ దర్శనీయుడు; తెలుగుతల్లి వర ప్రసాదుడు వరప్రసాదరెడ్డి!

ఆయనలో ఓ డాక్టర్ కోట్నిస్, ఓ డాక్టర్ బొల్లా ప్రెగడ సుబ్బారావుల ఘనతను, గరిమను గరిష్టంగా చూడవచ్చు. కర్మిష్టిగా భావించవచ్చు. ఈనాటి ఈ తరంలో అరుదైన వ్యక్తి వరప్రసాదరెడ్డి యని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఆయనకు నిండు నూట ఇరవైఏండ్లు ఆయురారోగ్య సౌభాగ్యాలను చేకూర్చమని బ్రహ్మదేవుణ్ణి ప్రార్థిస్తున్నాను. ఇలాంటి మంచివాళ్ళు పదికాలాలపాటు ఉంటే మరెంతో మంది మంచివారు ధరణిన జీవించే అవకాశం ఉంటుంది! ●

## రోజుకు రెండు పేజీలైనా వ్రాయండి నాన్నా! – అంటాడు మా పెద్దబ్బాయి వేంకటేశ్వరరావు!

**–ఇలాంటి సంతానం మద్రాసులోని 10 కుటుంబాల్లో ఒక్కరికైనా ఒక్కరుంటే – ప్రపంచంలోనే తెలుగు శతసహస్ర జ్యోతులై వెలుగుతుంది!**

మాది సాధారణ మధ్య తరగతి కుటుంబం. అరవైయేళ్ళ క్రితం నేనొక్కడినే పాలకొల్లు నుంచీ చెన్నయ్ వచ్చును. పత్రికా రచయితగా పాదం మోపాను. వచ్చీ రాగానే ప్రకాశం పంతులుగారి 'ప్రజాపత్రిక'లో అవకాశం లభించింది. అక్కణ్ణుంచీ వావిళ్ళ వారి త్రిలింగ, ఆంధ్రపత్రిక, తెలుగు స్వతంత్ర పత్రికల్లో అవకాశం లభించింది. స్వంతంగా మధురవాణి, మధురిమ, బాలరాజ్యం– అను మూడు పత్రికను ప్రచురించే స్థాయి లభించింది. మా పెద్దబ్బాయి వేంకటేశ్వరరావు కల్పించిన ప్రోత్సాహంతో 'ప్రముఖాంధ్ర'ను నిర్వహిస్తున్నాను. ఇటీవల వృద్ధాప్యపు బద్ధకం, మధుమేహ వ్యాధి కారణంగా వ్రాసే స్థాయి కొంచెం తగ్గింది. ఇందుకు తోడు పెద్దబ్బాయిపై నెలకు ఇరవై వేల రూపాయలకు పైగా భారం మోపేదెందుకు అనే భావన కలిగింది! వ్రాయడంలో కొంత అశ్రద్ధను వహిస్తూ వచ్చాను. వాడు పట్టువీడని భగీరథునిలా 'ప్రముఖాంధ్ర'పై అత్యంత శ్రద్ధను వహిస్తున్నాడు. సగటున రోజుకు రెండు పేజీలైనా వ్రాయమంటాడు. రెండు పదుల వేలకు పైగా నష్టం వాడికెందుకా– యని ఆలోచిస్తూంటాను; వాడూరుకోడు! ఈ పట్టుదలే అలనాటి ఆంధ్ర పత్రిక, గృహలక్ష్మి వారసులకుంటే తెలుగు పత్రికలకు ఇంతటి విషమస్థితి ఉండేది కాదు. ఆంధ్రరాష్ట్రం విడిపోయినా, ఎన్నో పత్రికలు చెన్నయ్ నుంచే వెలువడ్డాయ్; చెన్నయ్ నుంచీ వెళ్ళి ఆ పత్రికలు చిరునామాలు పోగొట్టుకున్నాయి. ఆ దౌర్భాగ్యపు స్థితి యేర్పడకూడదని రోజుకు రెండు పేజీలైనా వ్రాయమంటాడు. పాండవులు అయిదూళ్ళయినా ఇమ్మని అడిగినట్లు– ఆ రెండు పేజీలు రాయడం అసాధ్యంకాదనే జ్ఞానోదయమవుతూంది. రాస్తాను.

– గోటేటి

*Compliments from*
**Sri Krishna Bhat**
When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala
**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
**WOODSIDE**
**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464



# కుమారిగా... అమ్మ ఆరాధన!

**ఏకశక్తియైన పరాశక్తిని దేవీ నవరాత్రులలో నవ్యత్వంగా విస్తరింపజేసి, శరన్నవరాత్రులుగా రోజుకొక శక్తి రూపాన్ని ఆరాధించటం సంప్రదాయం! దేవీ భాగవతం, దుర్గాసప్తశతి, స్కాంద, శివ, ఆగ్నేయాది పురాణాలు పరాశక్తి తత్త్వాన్ని విపులంగా చెప్పాయి!**

కొందరు ముగురమ్మలుగా – దుర్గ, మహాలక్ష్మి, మహా సరస్వతులను– మూడు రోజుల చొప్పున తొమ్మిది రోజులు ఆరాధిస్తే, మరికొందరు మార్కండేయ పురాణం వచించిన దుర్గామాతను తొమ్మిది సౌందర్య స్వరూపాలైన 'నవదుర్గలు'గా పూజించి, పూర్ణఫలం పొందుతున్నారు. అయితే దేవీ ఆరాధనలో 'కుమారీ పూజ'కు ఉన్న ప్రత్యేకతను స్కాంధ పురాణం విశేషంగా చెప్పింది. నవరాత్రులలో కుమారీ పూజకు రెండు సంవత్సరాల వయస్సున్న బాలికల నుంచి పది సంవత్సరాల వయసు బాలిక వరకూ రోజుకొక బాలికను శాస్త్రవిధిగా పూజించాలని పురాణం నిర్దేశించింది. ఈ బాలికలకు క్రమంగా కుమారిక, త్రిమూర్తి, కల్యాణి, రోహిణి, కాళి, చండిక, శాంభవి, దుర్గ, సుభద్ర అను పేర్లతో పూజ చేయాలని 'నిర్ణయ సింధువు' తెలుపుతూ విధి విధానాలను వివరించింది.

'కుమారీ పూజ'లో ఒక సంవత్సరం వయస్సున్న బాలికలను, అనారోగ్యం అంగవైకల్యం ఉన్న బాలికలను పూజించరాదని నియమం ఉన్నది. భక్తి శ్రద్ధలతో విధి విధానాలను అనుసరించి పూజిస్తే, ఇహ, పర సుఖాలు ప్రాప్తిస్తాయని పురాణ వచనం.

పూజకు ముందు బాలికలకు తలంటు స్నానం చేయించి, నూతన వస్త్రాలు తొడిగి, పసుపు, పారాణితో, అవకాశం ఉన్నంతవరకు అలంకరణ చేసి దుర్గకు ప్రతీకగా పీఠంపై అధిష్ఠింపజేసి పూజకుపక్రమించాలి.

తొమ్మిది రోజులపాటు కుమారీ పూజ చేయాలి!

కుమారిక : తొలిరోజు పూజించే బాలికకు వయస్సు రెండు సంవత్సరాలు. 'కుమారిక' అని పేరుతో పూజించాలి.

**కుమారస్య చ తత్త్వాని యా సృజత్యపి లీలయా**
**కాదీనపి చ దేవాంస్తా కుమారీ పూజయామ్యహమ్**

ఏ దేవత తత్త్వాన్నీ, శబ్దములనూ, దేవతలనూ తన లీలతో సృజిస్తున్నదో ఆ దేవత 'కుమారి'ని పూజిస్తున్నాను. కుమారిని పూజించడం వలన దుఃఖదారిద్ర్య నాశనం జరిగి, ఆయురారోగ్యైశ్వర్యాలు సంప్రాప్తిస్తాయని భావించాలి.

**త్రిమూర్తి :** రెండవ రోజున పూజించే మూడు సంవత్సరాలన్ను బాలికకు గల పేరు 'త్రిమూర్తి'

**సత్యాదిభి స్త్రీ మూర్తిర్యాత్తైర్థి నానా స్వరూపిణీ**
**త్రికాల వ్యాపినీ శక్తి స్త్రీ మూర్తిం పూజయామ్యహమ్**

త్రిగుణాలు కలిగి నానా రూపాలు ధరించిన ముల్లోకాలలో వ్యాపించి ఉన్న శక్తి స్వరూపిణియైన నిన్ను పూజిస్తున్నాను.

త్రిమూర్తిని పూజించడం వలన పుత్ర పౌత్రాదులు, ధనధాన్యాలు దినదినాభివృద్ధి చెందుతాయి.

**కల్యాణి :** మూడవ రోజున పూజించే నాలుగు సంవత్సరాల బాలికను 'కల్యాణి' అంటారు.

**కల్యాణకారిణీ నిత్యం భక్తి సంపూజితానిశమ్**
**పూజయామి చ తాం భక్త్యా కల్యాణీం సర్వకామ్యదామ్**

సకల శుభాలనిస్తూ కామితాలను ఈడేరుస్తూ భక్తుల చేత నిత్యం పూజలందుకుంటున్న 'కల్యాణి'గా దర్శనమిస్తున్న దేవిని పూజిస్తున్నాను.

'కల్యాణి' దేవిని ఆరాధిస్తే ఆ దేవి కృప వల్ల విద్య ప్రాప్తిస్తుంది.

**రోహిణి :** నాలుగవ రోజున పూజించే ఐదు సంవత్సరముల బాలికకు 'రోహిణి' అని పేరు.

**రోహయతి చ బీజాని ప్రాగ్జన్మా సంచితానవై**
**యాదేవీ సర్వభూతానాం రోహిణీం పూజయామ్యహమ్**

బీజాలు మొలకెత్తేటట్లు చేసే శక్తి 'రోహిణి'. ప్రారబ్ద కర్మలననుసరించి జీవులను సృష్టించే శక్తి అయిన 'రోహిణి'ని పూజిస్తున్నాను.


రోహిణిని పూజించడం వల్ల గత జన్మలో చేసిన పాపాలు నశించి, ప్రస్తుత జన్మలో ధర్మయుక్తంగా ప్రవర్తించేటట్లు చేయడమే కాక శుభాలను ఒనగూరుస్తుంది.

**కాళిక :** ఆరు సంవత్సరాల వయస్సున్న బాలికను 'కాళిక' పేరుతో ఐదవనాడు పూజిస్తారు.

**కాళీ కాలయతే సర్వం బ్రహ్మాండం సచారచరమ్**
**కల్పాంత సమయే యాతాం కాళికాం పూజయామ్యహమ్**

(తరువాయి 11వ పేజీలో)





## శ్రీజగద్గురు భారతీతీర్థ మహాస్వామి చరణుల ఉపదేశము

# అందరి మంచినీ కోరండి!

మానవుడెప్పుడూ మంచి ఆలోచనలనే కలిగి ఉండాలి. ఇతరులకు హాని చేయాలనెడి చెడు ఆలోచనకు తావివ్వరాదు. ఇతరులకు హాని చేయాలని గట్టిగా ప్రయత్నించేవారు చివరికి వాళ్లే ప్రమాదంలో చిక్కుకుంటారు.

రామాయణంలో రావణుని చర్యలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. రాముని భార్య పతివ్రతాశిరోమణి అయిన సీతను రావణుడు అపహరించి లంకలో బందీగా ఉంచాడు. రాముని దూతగా హనుమంతుడు లంకకు వెళ్లి సీతను రామునికి అప్పచెప్పటం అతని మంచికే అని చెప్పాడు.

ఈ సలహాను పాటించకుండ, తనకు ఉచితమైన సలహాను అందించిన హనుమంతునికి హానిచేయ తలపెట్టి, ఆయన తోకకు నిప్పంటించమన్నాడు. అయితే అగ్ని హనుమంతునికి హాని కలిగించకుండా లంకనే కాల్చింది.

**దిధక్షన్మారుతేర్వాలం తమదీప్యద్ధశాననం॥**
**ఆత్మీయస్య పురస్యైవ సద్యో దహణ మన్వభూత్॥**

మన పూర్వీకులు మనకిచ్చిన సలహా.

అందువలన ఇతరులకు ఎవరూ హాని కలిగించ రాదు. శ్రీశంకర భగవత్పాదులు తనకు హాని కలిగించిన వారిపట్ల సహనాన్నే ప్రదర్శించారు. అది గొప్పవారి లక్షణం. శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో ఇదే విషయాన్ని చెప్పారు.

**యస్మాన్నోద్విజతే లోకో లోకాన్నోద్విజతే చ యః॥**
**హర్షామర్షభయోద్వేగైర్ముక్తో యః స చ మే ప్రియః॥**

ఇతరులలో భయం కలగటానికి అవకాశమివ్వని వారంటే భగవంతునికి చాలా ప్రీతి.

అటువంటి వ్యక్తి ఎవరు కావచ్చు? ఇతరులకు హాని జరగాలని కోరుకోనివాడు. వాడే భగవంతునికి నిజమైన భక్తుడు. మహాభారత కథలో కూడా యుధిష్ఠిరునికి హాని కలిగించబోయి దుర్యోధనుడు తానే నాశనమవటం మనం చూడగలం.

అందువలన ఈ విషయాన్ని తెలుసుకుని, ఇతరులకు హానిచేయాలనెడి సంకల్పాన్ని విరమించుకుని సహాయపడే మనస్తత్వాన్ని అలవరచుకోవాలి. ●




**(10వ పేజీ తరువాయి)**

సృష్టి, స్థితి లయకారిణి పరాశక్తి అయిన 'కాళిక'గా అవతరించిన నిన్ను దర్శించి, పూజిస్తున్నాను.

కాళికను ఆరాధిస్తే శత్రుభయం తొలగుతుంది.

**చండిక :** ఏడు సంవత్సరాల వయస్సున్న బాలికను 'చండిక'గా ఆరవ రోజున పూజిస్తారు.

**చండికాం చండరూపాం చ చండముండ వినాశినీమ్**
**తాం చండ పాపాపహరాం చండికాం పూజయామ్యహమ్**

చండముండులనే క్రూర రాక్షసులను ప్రచండ రూపం ధరించి మర్ధించిన 'చండిక'ను పూజిస్తున్నాను.

చండిక రూపంలో ఉన్న దేవిని ఆరాధిస్తే సకల అభీష్టాలు సిద్ధిస్తాయి.

**శాంభవి :** ఏడవ రోజున ఎనిమిది ఏళ్ల బాలిక 'శాంభవి' పేరుతో పూజలందుకుంటుంది.

**అకారణాత్సు ముత్పత్తి ర్యస్మయైః ప్రకీర్తితా**
**యస్యాస్తాం సుఖదాం దేవీం శాంభవీం పూజయామ్యహమ్**

సృష్టికి మూల కారణమై ప్రాణికోటితో కీర్తింపబడుతూ అందరికీ సుఖ సంతోషాలను సమకూరుస్తున్న పరాశక్తికి ప్రతీకగా 'శాంభవీ' రూపంలో ఉన్న నిన్ను పూజిస్తున్నాను.

శాంభవిని ఆరాధిస్తే క్లేశాలన్నీ తొలగి శుభాలు ప్రాప్తిస్తాయి.

**దుర్గ :** దేవీ నవరాత్రులలో ఎనిమిదవ రోజున తొమ్మిది సంవత్సరాల వయస్సున్న బాలికను 'దుర్గాదేవి' నామంతో ఆరాధిస్తారు. ఆ రోజు దుర్గాష్టమి.

**దుర్గాత్త్రాయతి భక్తం యా సదా దుర్గతి నాశినీ**
**దుర్‌జ్జేయా సర్వదేవానం తాం దుర్గామ్ పూజయామ్యహమ్**

అన్ని వేళలా కష్టాలను తొలగించి భక్తులను రక్షించేది దుర్గామాత. దేవతలందరికీ తెలిసిన దుర్గాతత్వం కలిగిన దుర్గను పూజిస్తున్నాను.

దుర్గామాతను ఆరాధించడం వల్ల సమస్తమైన దుర్గతులు తొలగి భక్తులకు ఇహపర సౌఖ్యాలు లభిస్తాయి.

**సుభద్ర :** నవరాత్రులలో తొమ్మిదవ రోజు 'మహార్నవమి' ఈనాడు. పది సంవత్సరాల వయస్సుగల బాలికను 'సుభద్ర'గా ఆరాధిస్తారు.

**సుభద్రాణి చ భక్తానాం కురుతే పూజితా సదా**
**అభద్ర నాశినీం దేవీం సుభద్రాం పూజయామ్యహమ్**

అభద్రాలను తొలగించి మంగళాలను ప్రసాదించే 'సుభద్ర'ను పూజిస్తున్నాను.

సుభద్రను పూజించడంవల్ల కష్టాలు తొలగి సమస్త మంగళాలు ప్రాప్తిస్తాయి.

పరాశక్తిని కుమారీ రూపంలో ఆరాధిస్తే 'సమస్త క్లేశాలు తొలగుతాయి. అభీష్టాలు నెరవేరుతాయి. ఇహపర సౌఖ్యాలు లభిస్తాయి' అని పురాణవచనం. అలా లభించిన ఆనందానికి అభివ్యక్తీకరణంగా పదోనాడు భక్తులందరు 'అమ్మలగన్న యమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాల పెద్దమ్మ'ను దర్శిస్తారు. ముగిసిన దసరాలకు ముగింపుగా 'విజయదశమి' పండుగనాడు ఆదిపరాశక్తికి నీరాజనాలు సమర్పించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకోవడం మన సంప్రదాయం.

ఇలాంటి సంస్కృతీ సంప్రదాయాలను ఎన్నింటికో ప్రతీక దసరాపండుగ.

– ఏ. సీతారామారావు



## ఆంధ్ర వాల్మీకి

# వావికొలను సుబ్బారావు

**వాల్మీకి రామాయణాన్ని చక్కగా ఆంధ్రీకరించి ఆంధ్ర వాల్మీకిగా ప్రసిద్ధి గొన్నారు!**

ఎందరో రామాయణమును ఆంధ్రీకరించారు. కానీ ఋషిధర్మంగా రామాయణ మును ఆంధ్రీకరించి, 'ఆంధ్రవాల్మీకి' ఘనతను పొందినవారు వావికొలను సుబ్బారావు గారే! వాల్మీకి తన రామాయణమును ఎవరికీ అంకితమీయలేదు, పైగా రాముడు రాజ్యమేలిన కాలంలో వాల్మీకి ఉన్నాడు. అడవిలో విడిచిన రాముని సతి సీతమ్మకు తన ఆశ్రమంలోనే ఆశ్రయమిచ్చి, సీతాపుత్రులైన కుశలవులను శ్రీరామునికి అప్పగించి, వారిని పట్టాభిషిక్తులను చేయించింది వాల్మీకి మహర్షే! ఆంధ్రవాల్మీకిగా కీర్తిని సంపాదించి వావికొలను సుబ్బారావుగారు తన రామాయణ మును ఒంటిమిట్ట లోని రామాలయములో రాముడున్నాడని భావించి ఒంటిమిట్ట శ్రీరామచంద్రునికి అంకితమిచ్చారు.

వావికొలనువారు కడప పట్టణంలోని మోచమ్మపేటలో జన్మించారు. వీరు భరద్వాజసగోత్రులు. గోల్కొండ నియోగులు, విశిష్టాద్వైతులు. రామచంద్రరావు కనకమ్మ దంపతుల ముగ్గురు కుమారుల్లో మధ్యవాడు సుబ్బారావు. అన్న శేషగిరి రావు, తమ్ముడు రంగారావు. మధ్యవాడైన సుబ్బారావే ఆంధ్రవాల్మీకి వాసు దేవస్వామి. వీరు 1863 సం॥ జనవరి 23న ఉదయం 7.30 ని॥లకు పూర్వాభాద్ర నక్షత్రమున జన్మించారు. ఆ రోజున తల్లి కనకమ్మగారి కలలో ఆదిశేషుడు కనిపించిన కారణంగా తల్లిదండ్రులు సుబ్బారావుయనే నామకరణం చేసారు. వారు నిజానికి శ్రీరాముని భక్తులు. జాతక చక్రం వేసిన దైవజ్ఞులు సుబ్బారావు మహాయోగి యవుతాడనీ, మహాకవిగా రాణిస్తాడని చెప్పారు.

సుబ్బారావుకు సరిగా మాటలు వచ్చేవి కావు. కానీ సీతారాముల విగ్రహాలను బొమ్మరింటిలో పెట్టుకుని పూజించేవాడు. నాలుగేండ్ల వయసులో మాటలు రాగానే రామ, కృష్ణ, రంగ, హరి నామములనే ఉచ్చరించేవాడు. సుబ్బారావు జాతకమేమో గానీ, 5వ ఏటనే తండ్రిగారు మరణించారు. పినతండ్రి లక్ష్మణరావుగారి పెంపకంలో పెరిగాడు. స్వయం కృషితో తెలుగు, ఇంగ్లీషు, సంస్కృతం భాషల్లో అసమాన పాండిత్యం సంపాదించాడు. కానీ ఆయన్ను చిన్నతనంలోనే శ్వాసకోశ రోగం బాధించింది. 1881 సం॥ములో ఎఫ్.ఏ చదువుతుండగా వ్యాధి ఎక్కువైంది. భయపడిన తండ్రి చదువు వలదన్నాడు.

అది 1883 సం॥ము ప్రొద్దుటూరు తాలూకా కచ్చేరిలో దఫ్తరు బందు ఉద్యోగిగా చేరి, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ స్థాయికి ఎదిగారు. 1885 సం॥లో నెల్లూరు వాసులు కంచెనపల్లి శేషగిరిరావు పుత్రిక రంగనాయకమ్మతో ఆయన వివాహం జరిగింది. సుబ్బారావు దంపతులకు ఒక కొడుకు పుట్టి చనిపోయాడు. ఆయనలో వైరాగ్యం కల్గింది.

ఆయన 22వ ఏట కంపసముద్రం చెట్లూరి నరసింహాచార్యులు ఆయనకు పంచ సంస్కార దీక్ష నిచ్చి శ్రీరామషడక్షరీ మంత్రం ఉపదేశించారు. పినతండ్రి లక్ష్మణరావుగారి వద్ద శ్రీమద్రామాయణం ఉపదేశం పొందారు. రామాయణ పారాయణం కారణంగా ఆయనకు కవితా వైశారద్యమబ్బింది. శ్రీకుమారాభ్యుదయం అనే గ్రంథాన్ని రచించారు. ఒకే ఒక పూజలో ఆయన శ్రీతల్పగిరి రంగనాయక శతకం రచించి, అందర్నీ అబ్బురపరిచారు. అలా వ్రాయడం ఎలాంటి కవులకూ సాధ్యం కాదు. తల్లిగారి ప్రేరణతో ఆయన సులభశైలిలో 'కౌసల్యా పరిణయం' కావ్యం వ్రాశారు. రామచంద్రుని కృపయేమోగానీ ఆయనకు శ్వాసకోశ తిరగపెట్టి క్షయగా మారింది. ఉద్యోగ విరమణ చేసి కడప మోచమపేటలోని స్వగృహానికి తిరిగివచ్చారు. తాను తలపెట్టిన రామాయణరచనం పూర్తి చేయగలనో లేదోనన్న భయం కలిగింది. కానీ శ్రీరామానుగ్రహంతో 'శ్రీరామనుతి' యనే సంగ్రహ రామాయణమును 108 వాక్యాల్లో రచించారు. వ్యాధి కొంచెం ఉపశమించింది. చెన్నపట్నం వచ్చి హైందవో న్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేరారు. ఆయన కవిత్వ పాండిత్య వైభవాలు దేశమంతటా వ్యాప్తినొందాయ్. తత్ఫలితంగా ఆయనకు మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో ప్రధాన ఆంధ్రోపన్యాసకుని పదవి లభించింది. 1904 సం॥ము నుంచీ 1920 వరకు ఆ ఉద్యోగం చేశారు. పదవీ విరమణం తరువాత కాలంలోనే తెలుగు కవులు పూండ్ల రామకృష్ణయ్య వేదం వెంకటరాయశాస్త్రి, తిరుపతి వేంకట కవులు, కొక్కండ వెంకటప్పయ్య పంతులు, ధర్మవరం రామ కృష్ణాచార్యులు గారలు వారి సమకాలికులూ స్నేహితులయ్యారు.

వావిల కొలను సుబ్బారావుగారినీ బమ్మెరపోతన, భద్రాచల రామదాసును లొక్కటైన మూర్తిత్రయంగా విశిష్టస్థానమందించి గౌరవించారు. ఆంధ్రుల ఆధ్యాత్మిక భావనలను కవితా మాధుర్యంలో రంగరించిన అత్యున్నత కవిస్థానం ఆయనకే దక్కింది. వాల్మీకి రామాయణం మూలాంశంగా చేసుకుని 2400 శ్లోకాలను 2400లు పద్యాలుగా రచించారు. ఆ కావ్యాన్ని 1908 అక్టోబర్ 9, 10, 11 తేదీల్లో జరిగిన సాహితీ మహాసభల్లో 50 వేల మంది మహామహుల సమక్షమున ఒంటిమిట్ట శ్రీరామచంద్రునికి అంకితమిచ్చారు.

**(తరువాయి 13వ పేజీలో)**




# ప్రముఖాంధ్ర ఎవ్వరిది! సంపాదకుణ్ణయిన నాదా? ప్రచురణ కర్త జీ.వి. రావుదా?

## ఇరువురిదీ కానేకాదు. పాఠకులైన ప్రముఖాంధ్రుల అందరిదీ!

ఎవరు ప్రముఖాంధ్రులు? మాతృభాషాంధ్రపై అపార మక్కువను చూపే, అవ్యాజమైన వాత్సల్యానురాగములు చూపేవారందరూ ప్రముఖాంధ్రులే! భాష తియ్యందన్నా నెరింగినవారు విలియం బ్రౌను, అప్పయ్య దీక్షితులు వంటి అగ్రశ్రేణి అన్యభాషీయులందరూ! అనన్యంగా మెచ్చుకోలందించిన వారందరూ! మధురాతి మధురమైన భాషయని కొనియాడిన వారందరూ!

'తులు వంశీయుడూ, సాహితీ సమరాంగనా చక్రవర్తిగా స్తుతింపబడిన శ్రీకృష్ణదేవరాయరాయలు. వారిచే ఆరాధించబడిన అగ్రపూజలందుకున్న భాష ఆంధ్రభాష.

శ్రీనాథ కవిసార్వభౌమునిచే ఖ్యాతి, గౌరవములు అందుకున్న భాష మధురమైన భాష. దేశభాషలందు లెస్సగా పొగడబడిన దేశీయ భాష తెలుగుభాష! బమ్మెరపోతన మనోహర్ కవితల(చే) పట్టాభిషేకమందిన భాష!

56 లఘు, గురు శబ్దాలతో అలరింపబడిన అజంతాభాష! అగ్రపూజ్య భాష ఆంధ్రభాష!

(12వ పేజీ తరువాయి)

ఆంధ్ర నాటక పితామహులు ధర్మవరం రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన యా మహాసభలోని మహామహులు ఘనాతిఘనమైన కవిత్వంగా అభివర్ణించారు. ఆ సభల్లో సుబ్బారావుకు 'ఆంధ్రవాల్మీకి' యనే బిరుదమునిచ్చి గౌరవించారు. అంతేకాకుండా పాఠశాల విద్యార్థులను నీతిమంతులుగా తీర్చిదిద్దే విధంగా ఆయన హరిశ్చంద్ర చరిత్రను వ్రాసారు.

సత్యమూర్తియైన హరిశ్చంద్ర చరిత్రను చదివి గాంధీగారు సత్యవ్రతా నిష్ఠుడైన విషయం సర్వజన విదితమే! వీటి సరసన విద్యార్థులకు నీతిదాయకమైన ఆర్య చరిత్ర, నీతికథా గ్రంథములను రచించారు. రత్నావళి, ఆర్యకథానిధి గ్రంథాలను రచించారు. విద్యార్థులను భాషాప్రవీణులుగా తీర్చిదిద్దడం కోసం వ్యాకరణాన్ని మూడు సంపుటాలుగా సులభతరం చేసారు! త్రిమతాలకు సమ్మతంగా ఉండేట్టు 'భగవద్గీత'ను ద్విపదగా రచించారు.

వాల్మీకి రామాయణమును యథాతథంగా తనదైన శైలిలో వ్రాసినందులకు ఆయన్ను 'ఆంధ్రవాల్మీకి'గా రచయితలు అభివర్ణించారు. అదే ఆయనకు సార్థక నామమైంది. ఆయన ఎన్నో గ్రంథాలను రచించారు. ఎంతో సాహిత్య సేవ చేశారు. వారెవ్వరికి రానీ, వారికి స్థిరపడిన బిరుదనామం ఆంధ్రవాల్మీకి నామం సార్థకమైంది. కానీ ఆయన ఇంటిపేరులోని నామాక్షరములోని 'సు' దాశానుదాస శబ్దంగా 'దాసు' చేర్చుకుని వాసుదేవ స్వామిగా పిలిపించుకున్నారు. ఆహార నియమం పాటిస్తూ పక్వాహారమును తినకుండా పాలూ పండ్లు తిసుకునేవారు. ఆయన భార్య రంగనాయకమ్మ 1910లో పరమపదించిన తరువాత వారు అయోధ్య, మధుర, మాయా, అవంతీ, కాశీ, గయ, ప్రయాగ, ద్వారక, బదరీ పుణ్యక్షేత్రాలను సందర్శించారు. వారి తమ్ముడు రంగారావు కూతుర్ని పెంచి పెండ్లి చేసారు. గజేంద్ర మోక్ష ఉత్సవమును తన తల్లిపేరుతో జరిపించారు. ఆమె శాశ్వతమోక్షం కోసం తన భవనమును నెల్లూరు మూలపేట వేణుగోపాలస్వామివారికి అప్పగించారు. తన తండ్రిపేరిట కైంకర్యం కోసం కొంత ఆస్తిని సమర్పించారు. ఘటికాచలం వెళ్లి ఆత్మసాధన చేస్తూ రామతారకం లక్షలకు లక్షలు సమర్పించారు. ఆంజనేయస్వామిని ప్రధానంగా అర్చించారు. ఆంజనేయుని సీతమ్మలను అర్చించారు. ఆయన ఘటికా చల క్షేత్రమహాత్మ్యమును వ్రాస్తున్నప్పుడు ఇద్దరు సాధువులు కనబడి నీవు యిక్కడే ఉంటావా ఒంటిమిట్ట రావా- అని ప్రశ్నించారు. కలలో కనిపించిన వారిరువురు రామలక్ష్మణులే నని తలంచి, ఆయన ఒంటిమిట్ట చేరుకున్నారు. అక్కడివారు ఒంటిమిట్ట కోదండస్వామి ఆలయంలో కౌపీనమును కట్టుకుని, ఒక్క కొబ్బరిచిప్ప చేతనుంచుకుని ఊరూరా భిక్షాటనం చేస్తూ జీవించారు. కోదండరామ స్వామి ఆలయ పునరుద్ధరణా కార్యక్రమమును చేపట్టి పూర్తి చేసారు. ఆ సందర్భములోనే ఆయన టెంకాయశతకం వ్రాసారు. కోదండరామునికి కిరీటం చేయించారు. వివిధ ఆరాధనా కార్యక్రమములను చేశారు. 108 పట్టాభిషేకాలు చేసారు. సీతమ్మకు మంగళ సూత్రములు, నల్లపూసలు వివిధరక వివాహ ఆభరణములు చేయించారు. 500 పుణ్యనదుల తీర్థములతో అభిషేకం చేయించారు. 108 పట్టాభిషేక ముద్రల గొలుసును శ్రీరామచంద్రునికి 50 వేలమంది సమక్షంలో రామపట్టాభిషేకము జరిపారు. ఇలాంటి పవిత్ర కార్యాలను చేసిన వావికొలనువారిని గురించి వివరించ డం సాధ్యం కాదు, వేల పుటల విస్తృత గ్రంథమవుతుంది.

ఆయన ముందుగా ప్రకటించిన విధంగానే ధాతునామ సంవత్సర (1-8-1936) శ్రావణ శుద్ధ చతుర్థశీ సోమవారం సాయంత్రము, ఆయన బ్రహ్మ రంధ్రమును చేధించుకుని ఆయన అసువులు పరమాత్మలో లీనమయ్యాయి. దాసశేషస్వామి, వైష్ణవోత్తములు సీతమ్మ, తురగా కామాక్షమ్మ ప్రభృత భక్తులు భౌతికకాయానికి అంత్యక్రియల మహోత్సవాన్ని ఘనంగా జరిపారు. పిమ్మట ఒంటిమిట్టలో ఉత్తర క్రియలు జరిపించారు.

రామకార్యంగా పుట్టిన వాసుదేవస్వామి స్మృతి చిహ్నంగా ఒంటిమిట్టలోని శృంగిపర్వతంపై గల వాల్మీకి ఆశ్రమంలో వాసుదేవస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేసి నిత్య పూజలు జరిపిస్తున్నారు.

ఇమ్మహిని, ఆంధ్రదేశంలో ఇలాటి భక్తాగ్రేసరులైన మహాత్ములు పుట్టడం, చిరకాల కీర్తిని సంపాదించి వెళ్ళడం ఆంధ్ర ప్రజలు చేసుకున్న పుణ్యతపః ఫలం. వీరే నిజమైన కీర్తిశేషులుగా నివాళులందుకున్నారు. నిజానికి వీరే నిజమైన కీర్తిశేషులు.

ఆంధ్రవాల్మీకి గురించి, సంక్షిప్తంగా తెలిపి, ఓ గ్రంథమును రచించినంత ఆనందమును పొందుతున్నాను. నిజాస్వాదనము చేస్తున్నాను. మిమ్మల్నీ నిజ ఆనంద రసాస్వాదన చేయమని విన్నవిస్తున్నాను. ●

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన

"అజంతా"

వక్కపొడి

రవికుమార్ అండ్ కంపెని - చెన్నై



# బ్రహ్మాండ నాయకుడు వేంకటనాథుడు

కృతయుగంలో పది సంవత్సరాల తపస్సుతో పొందిన పుణ్యాన్ని, త్రేతాయుగంలో ఒక సంవత్సర సాధనలో పొందవచ్చు. ద్వాపరయుగంలో ఐదు మాసాలలో సంపాదించవచ్చు. కలియుగంలో అయితే ఒకే ఒక్క రోజు మూటగట్టుకోవచ్చు. ఆ ఒక్క రోజు కోటిరెట్ల పుణ్యఫలాన్ని సంపాదించాలంటే రెప్పపాటు వెంకటేశ్వరస్వామిని దర్శించాలి. శ్రీనివాసుడిని దర్శించుకుంటే కాశీ, గంగ, ప్రయాగల దర్శనఫలం లభిస్తుంది' అంటూ స్కాంద పురాణం ద్వితీయ వైష్ణవ ఖండం, వేంకటాచల మహాత్మ్యం, వరాహ పురాణం తదితర గ్రంథాలు వక్కాణించి చెబుతున్నాయ్.

## శ్రీనివాసా గోవిందా...

వేంకటేశ్వర వైభవానికి ప్రధాన కారణం... సాక్షాత్తూ వ్యూహలక్ష్మి ఆ స్వామి హృదయంలో కొలువుదీరి ఉండటమే! వైకుంఠవాసుడే కలియుగంలో భూలోకవాసులను తరింపచేయడానికి తిరుమలగిరులలో వెలిశాడు. ఆ స్వామినెప్పుడూ అనుసరించి ఉండే లక్ష్మీదేవి... వ్యూహలక్ష్మి. ఆ అమ్మ ఆయన వెంటే భూలోకానికొచ్చి స్వామి వక్షస్థలంలో కొలువుతీరింది. దేవుడి దర్శనానికొచ్చే భక్తులను ముందుగా ఆశీర్వదించేది లక్ష్మీ అమ్మే! 'శ్రీ' అంటే లక్ష్మీదేవి. లక్ష్మీదేవికి నివాసమైనవాడు కనుకనే శ్రీనివాసుడు అన్న పేరొచ్చింది. ఆ అమ్మతో కలిసి సకల జీవరాశిని వేంకటేశ్వరుడు కాపాడుతుంటాడు. కనుకనే ఆయన్ను గోవిందుడన్నాడు. వ్యూహలక్ష్మి శ్రీమహాలక్ష్మి ఆ తల్లి దయ ప్రేమ, క్షమ గుణాలకు పెట్టింది పేరు. స్వామి దర్శనవేళ భక్తుల మనసు ప్రశాంతంగా ఉండడానికి కారణం అదే! దయ, ప్రేమ, క్షమ అనే మూడు వారి మీద ప్రసరించడమే! ఆ మాటకొస్తే అమ్మ వేంకటేశ్వరస్వామి హృదయంలోనే కాదు... అంతటా ఆ అమ్మ వేరు వేరు పేర్లతో నెలకొని ఉంది. గోవిందుడి ముఖ భాగంలో భాగ్యలక్ష్మిగా, అరచేతిలో దానలక్ష్మిగా, భుజాలలో వీరలక్ష్మిగా, హృదయంలో కారుణ్యలక్ష్మిగా, ఆ స్వామి దగ్గరుండే నందక ఖడ్గం చివరన శౌర్యలక్ష్మిగా, ఆయనలోని అన్ని గుణాలలోనూ కీర్తిలక్ష్మిగా, సర్వాంగాలలోనూ సౌమ్యలక్ష్మిగా, విజయాలలో సర్వసామ్రాజ్యలక్ష్మిగా... ఆ వ్యూహలక్ష్మి కొలువుతీరి ఉన్నది.

## పాదదర్శన సౌభాగ్యం...

స్వామి భక్తులు జీవితంలో ఒక్కసారైనా శ్రీవేంకటేశ్వరుడి నిజపాద దర్శనం చేసుకోవాలనుకుంటారు. ఆ చరణాలకు ఎందుకింత ప్రాధాన్యం అంటే... సాక్షాత్తు ఆ మహాలక్ష్మి స్వామి వక్షపీఠం మీద నివాసం ఉంటూ తన రెండు కళ్ళతోనూ ఆయన పాదాలనే చూస్తుంటుంది. అయినా ఆ తల్లికి తృప్తి కలుగలేదు. శ్రీదేవి, భూదేవిగాను, ఆయన సన్నిధిలోనే నీళారూపిణిగాను, మూడు దివ్య అవతారాలను ధరించి ఆరు కళ్ళతో ఆ పాదపద్మాలను తిలకించసాగింది. స్వామికి శయ్యగా మారిన ఆదిశేషుడు కూడా తన వెయ్యి తలలలోని... రెండువేల కళ్లతో భగవానుడి పాదపద్మ వైభవాన్ని తిలకిస్తూ, పులకిస్తూ ఉంటాడు.

శ్రీవారి పాదాలు అనంతశక్తి నిధులు. సాముద్రికా శాస్త్రం ఆ పాదాలలోని రేఖలనూ, వాటి దివ్యశక్తినీ సోదాహరణంగా వివరిస్తోంది. అజ్ఞాన అంధకారాన్ని పోగొట్టే మహిమ అద్భుత రేఖలున్న ఆ పాదాలకుంది. ఆ పాదాలలో ఉన్న శుభ చక్రరేఖ వేదశాస్త్ర జ్ఞానాన్నీ, వేదాన్నీ ఆశ్రయించినవారిని అనుగ్రహిస్తుంది. ఆ పాదాలో ఉండే 'గదారేఖ'... రాక్షసులు, పిశాచులు, కూష్మాండులు లాంటి వారందరినీ మర్దించే శక్తిని కలిగివుంటుంది. అందుకే స్వామి పాదసేవ చేసేవారికి ఎలాంటి పీడలు ఉండవంటారు. అంతే కాదు ఏడుకొండవాడిని కొలిచే ఇళ్లలో... ఆ స్వామి సతి పద్మావతి, పద్మసంభవుడైన బ్రహ్మ కూడా కొలువుతీరి ఉంటారు. ఇంతటి మహిమకు కారణం శ్రీనివాసుడి పాదాలలో 'పద్మరేఖ' ఉండటమే. పద్మం ఉందంటే, జలరాశీ ఉన్నట్టే. విరజా నది, మానసరోవరం, ధనుష్కోటి, గంగానది లాంటి సర్వోత్తమ ప్రవాహాలన్నీ ఆ దేవదేవుడి పాదాల క్రింద ప్రవహిస్తూంటాయి. స్వామి పాదాలలో 'వజ్రరేఖ' ఉంటుంది. దాని ప్రభావంతోనే పాదదర్శనం చేసుకున్న భక్తుల పాపాలు, వజ్రాయుధంతో నాశనం చేసినట్లు సమూలంగా తొలగిపోతాయి. ఏనుగుల్లాంటి కష్టాలను ఆ పాదాలు అదుపుచేస్తూ ఉంటాయి. ఆ పాదాలలో 'అంకుశరేఖ' ఉండటమే కారణం. తన పాదాలను ఆశ్రయించిన వారికి ఉన్నత స్థానాన్ని ఇవ్వడమే ఆ స్వామి పట్టిన దీక్ష. ఆ దీక్షను సూచించడానికే తన పాదాలలో 'ధ్వజరేఖ'ను వేంకటేశుడు కలిగివుంటాడు. నందాకాంశ సంభూతుడైన తాళ్ళపాక అన్నమాచార్యుడు ముప్పయిరెండు వేల కీర్తనల్లో శ్రీపాదుడి పాద పద్మాల వైభవాన్ని కొనియాడాడు. ఈ పాదమే కదా యిలయెల్ల గొలిచినది. ఈ పాదమే కదా యిందిరా హస్తముల కితవైనది... ఈ పాదమే కదా ఇందరును మ్రొక్కినది... ఈ పాదమే కదా యీ ఘనగంగ పుట్టినది' అంటూ బ్రహ్మ కడిగిన పాదాలకు పదార్చన చేశాడు. బ్రహ్మమే తానైన పాదాలను శరణు వేడాడు. ***(శ్రీమల్లికి కృతజ్ఞతలు)***

SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*




*'దేశభాషలందు తెలుగు లెస్స' అన్నాడు ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయులు. 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అన్నాడు వెనీషియన్ యాత్రికుడు నికోలో డికాంటే. ఇప్పటికీ ఇవే మాటలను ఉటంకిస్తూ సంబరపడిపోతుంటారు మన భాషాభిమానులు! వెయ్యేళ్ళకు పైబడిన సుదీర్ఘ చరిత్ర, ఎట్టకేలకు దక్కిన ప్రాచీన హోదా... ఇక తెలుగు భాషకు లోటేమిటి? పైగా తెలుగు భాషకు ముంచుకొచ్చే ముప్పేమీ లేదని ఇటీవలే పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా కూడా తేల్చింది. అలాంటప్పుడు ఘనత వహించిన మన తెలుగుభాషకు ఢోకా ఏముంటుంది? నిజమే! ఇప్పటికిప్పుడు ముంచుకొచ్చే ముప్పేమీ లేదు. అలాగని ఇంతటితోనే సంబరపడిపోయి, ఇక్కడితోనే వదిలేస్తే సమీప భవిష్యత్తులో కాకపోయినా, సుదూర భవిష్యత్తులోనైనా తెలుగు భాష పరిస్థితి అగమ్యగోచరంగా మారే ప్రమాదం లేకపోలేదు!*

**నాలుగేళ్లు రాకముందే పిల్లలనుబడికి పంపించేస్తున్నాం. 'అ ఆ'లు దిద్దటం కంటే ముందు 'ఏబీసీ...'లు దిద్దడం నేర్చుకుంటున్నాం. ప్రపంచంతో పోటీపడాలి! ఇంగ్లీష్ మీడియంలోనే చదివిస్తాం. పై చదువులూ ఇంగ్లీష్‌లోనే! మరి ఈ మొత్తం ప్రయాణంలో తెలుగు ఎక్కడో వెనకబడిపోతోందన్న భయం ఉంటుంది కదా! మాట్లాడటం వచ్చి కూడా తెలుగు చదవలేని, రాయలేని పరిస్థితుల్లోకి భవిష్యత్ తరాన్ని నెట్టేస్తున్నాం. మరి ఇలాంటి పరిస్థితుల్లోనూ తెలుగు బతకాలి; బతికించుకోవాలి; అందుకో దారిని వెతుక్కోవాలి.**

**తెలుగుదేశం తేజరిల్లగ తెలుగు వెలుగులు
దిశలనిండగా తెలుగులో మాట్లాడరా!
ఓ తెలుగువాడా!**




## తెలుగు వెలుగుల ఘన చరిత్ర



క్రీస్తు పూర్వం ఐదో శతాబ్ది నాటికే తెలుగు ఉనికిలో ఉండేది. భట్టిప్రోలు వద్ద లభించిన పురాతన శాసనాల్లో తెలుగు పదాలు కనిపించాయి. ఆ శాసనాలు క్రీస్తు పూర్వం 400– 100 సంవత్సరాల నాటివని పురాతత్వ శాస్త్రవేత్తలు గుర్తించారు. రాజరాజ నరేంద్రుడి ఆస్థానకవి నన్నయ భట్టారకుడు క్రీస్తుశకం పదకొండో శతాబ్దిలో ఆంధ్ర మహాభారత రచన చేపట్టాడు. అయితే నన్నయకు ముందే తెలుగు భాష, చంధస్సు, సాహిత్యం, వ్యాకరణం ఉనికిలో ఉండేవి. శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం



## తెలుగుని వదలుకోని ప్రకటనలు

డిజిటల్ ప్రపంచంలో గ్రామీణ ప్రాంతాలకు కూడా సోషల్ మీడియా విస్తరించింది. ఇంగ్లీష్ పెద్దగా రానివారు సైతం సోషల్ నెట్‌వర్క్‌లో భాగమై ఉన్నారు. ఈ నేపథ్యంలోనే అడ్వర్టైజింగ్ కంపెనీలు కూడా ప్రాంతీయ భాషల్లో తమ ప్రకటనలు ఉండేలా చూసుకుంటున్నాయి. అదేవిధంగా ఆన్‌లైన్లో ఇంగ్లీష్ ప్రకటనలతో పోల్చుకుంటే తెలుగులో వచ్చే ప్రకటనలను స్పందిస్తున్న వారి సంఖ్య 30 శాతం అధికంగా ఉందని సర్వేలు చెబుతున్నాయి. అంటే ఇక్కడా తెలుగుకే ఓటేస్తున్న వారెక్కువ!

## బ్లాగులు, ఆన్‌లైన్ పత్రికలు

బ్లాగు రాకతో తమ రచనలను ఎవ్వరి సహకారం లేకుండా నేరుగా ప్రపంచానికి పరిచయంచేసే అవకాశం ఈతరం వారికి దక్కింది. వారంతా సొంతంగానే రాసుకుంటూ, భాషపట్ల ఉన్న మమకారాన్ని చూపుతూనే ఉన్నారు. బ్లాగుల్లో తెలుగు రాస్తూ తమకంటూ ఓ ప్రత్యేక స్థాయిని తెచ్చుకుంటున్నవారు ఎక్కువగానే ఉన్నారు. బ్లాగులకు తోడు ఆన్‌లైన్లో కొత్తగా వస్తోన్న ఆన్‌లైన్ పత్రికలు కూడా తెలుగు భాషను పరిరక్షించడానికి కృషి చేస్తున్నాయి. ఇంకా కృషి చేయాలి.


దీర్ఘాశిగ్రామ శివారలలో శిథిలావస్థలో లభించిన శిలాశాసనంపై ఉన్న సీస పద్యం నన్నయకు మునుపటిదేనని పరిశోధకులు తేల్చి చెప్పారు. కన్నడ ఆదికవి పంపన తెలంగాణాలోని వేములవాడ ప్రాంతానికి చెందినవాడని తెలంగాణా ప్రభుత్వం మద్రాసు హైకోర్టుకు ఆధారాలు సమర్పించింది. నన్నయ కంటే పూర్వీకుడైన పంపన తెలుగులో కూడా కవిత్వం రాశాడు. నన్నయ తర్వాత తిక్కన, ఎర్రన వేర్వేరు కాలాల్లో మహాభారత రచనను పూర్తి చేశారు. పాల్కుర్కి సోమనాథుడు జాను తెలుగులో కావ్య రచన చేశాడు. ఆ తర్వాతి కాలంలో శ్రీనాథుడు కవిసార్వభౌముడిగా వెలుగొందాడు. పోతన అజరామరమైన భాగవత రచన చేశాడు. శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవులైన అల్లసాని పెద్దన, నంది తిమ్మన, మాదయగారి మల్లన, ధూర్జటి, అయ్యలరాజు రామభద్రుడు, పింగళి సూరన, రామరాజ భూషణుడు, తెనాలి రామకృష్ణుడు వంటివారు అద్భుతమైన ప్రబంధాలను రచించి తెలుగు భాషను సుసంపన్న చేశారు. శ్రీకృష్ణదేవరాయులు స్వయంగా 'ఆముక్త మాల్యద' కావ్యాన్ని రాశాడు. పదిహేడో శతాబ్దికి చెందిన వేమన లోకరీతిపై రాసిన విమర్శనాత్మక పద్యాలు నేటికీ ప్రజల నాల్కలపై నడయాడుతూనే ఉన్నాయి.

## ఆధునిక తెలుగుభాషా వైతాళికులు



కందుకూరి వీరేశలింగం

బ్రిటిష్ పాలన కొనసాగుతున్న సమయంలోనే పరవస్తు చిన్నయసూర్తి బాల వ్యాకరణం, నీతి చంద్రిక వంటి రచనలు చేశారు. పానుగంటి లక్ష్మీనరసింహారావు, కందుకూరి వీరేశలింగం పంతులు వంటివారు నాటి సాంఘిక దురాచారాలను వ్యతిరేకంగా వ్యంగ్య రచనలు చేశారు. అప్పట్లో సంస్కృత భాషా భూయిష్టమైన గ్రాంథిక భాష ప్రభావం ఎక్కువగా ఉండేది. గొప్ప... గొప్ప సాహితీవేత్తలు గొప్ప సాహిత్యాన్నే సృష్టించినప్పటికీ, అదంతా గ్రాంథిక భాషలో ఉండడం వల్ల సామాన్యులకు చేరువ కాలేకపోయింది.



గురజాడ అప్పారావు

గిడుగు రామమూర్తి వ్యావహారిక భాషోద్యమం చేపట్టడంతో తెలుగు భాషకు దశ, దిశ మారాయి. గురజాడ అప్పారావు వాడుక భాషలో రాసిన 'కన్యాశుల్కం' ఆధునిక తెలుగు సాహిత్యంలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. నవల, కథానిక వంటి పాశ్చాత్య సాహితీ ప్రక్రియలు ఆ కాలంలోనే తెలుగులోకి వచ్చాయి. చాలామంది రచయితలు వ్యవహారిక భాషలో రచనలు ప్రారంభించినా తెలుగు పత్రికలు మాత్రం చాలాకాలం మడిగట్టుకుని గ్రాంథికంలోనే వార్తలు, సంపాదకీయాలు రాసేవి. గిడుగు రామమూర్తి శిష్యుడైన తాపీ ధర్మారావు తొలిసారిగా తెలుగు పత్రికల్లో వాడుక భాషను ప్రవేశపెట్టారు. ఆయన సంపాదకత్వంలోని 'జనవాణి' వాడుక భాషలో వచ్చేది. ఆ తర్వాత కొద్ది కాలానికే తెలుగు పత్రికలన్నీ వ్యావహారిక భాష వైపు మళ్లాయి.

## బ్రౌను తెలుగు భాషా సేవ



బ్రిటిష్ అధికారి చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ తెలుగు భాషకు చిరస్మరణీయమైన సేవలందించాడు. మరుగన పడిన వేమన పద్యాలను, ప్రాచీన కావ్యాలను వెలుగులోకి తెచ్చాడు. సొంత ఖర్చుతో పండితుల చేత వాటిని పరిష్కరింపజేసి, పుస్తకాలుగా ముద్రించారు. స్వయంగా ఇంగ్లీష్ – తెలుగు నిఘంటువును తయారు చేసి, ప్రచురించాడు. కడప, మచిలీపట్నం, రాజమండ్రి ప్రాంతాల్లో తెలుగు విద్యావ్యాప్తికి ఎనలేని కృషి చేశాడు. బ్రౌన్ ఇండియన్ సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన కాలంలో సర్ థామస్ మన్రో మద్రాసు ప్రావిన్స్ గవర్నర్‌గా ఉండేవాడు. సివిల్ సర్వీసెస్ అధికారులందరూ తప్పనిసరిగా స్థానిక భాషల్లో ఏదో ఒకటి నేర్చుకోవాల్సిందేనని ఆయన ఆదేశించడంతో బ్రౌన్ తెలుగును ఎంపిక చేసుకున్నాడు. వెలగపూడి కోదండరామ పంతులు వత్త తెలుగు నేర్చుకున్నాడు. తెలుగుమీద ఎనలేని మమకారాన్ని పెంచుకుని, జీవితాంతం తెలుగుభాషకు శాయశక్తులా సేవలందిస్తూనే వచ్చాడు. రిటైర్మెంట్ తర్వాత బ్రిటన్‌కు తిరిగి వెళ్ళిపోయినా, లండన్ యూనివర్శిటీలో కొంతకాలం తెలుగు ప్రొఫెసర్‌గా పనిచేశాడు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలైనా, విశ్వవిద్యాలయాలైనా తెలుగు భాషకు బ్రౌన్ చేసిన సేవలో లేశ మాత్రమైనా చేయలేదనేది నిష్ఠుర సత్యం.

## తెలుగు విశేషాలు

- నన్నయ మహాభారతాన్ని తెలుగులోకి అనువదించడానికి ముందు మరొక గ్రంథాన్ని రాశారు. అది 'ఆంధ్రశబ్ద చింతామణి' అనే వ్యాకరణ గ్రంథం. ఇదే తెలుగులో తొలి వ్యాకరణ గ్రంథం. దీనిని రచించినందువల్లనే నన్నయకు 'వాగనుశాసనుడు' అనే బిరుదు వచ్చింది.
- భారత భూభాగానికి వెలుపల ఒక తెలుగు గ్రంథాలయం ఉంది. మయన్మార్ రాజధాని యాంగన్‌లో 'శ్రీయోగి వేమన గ్రంథాలయం' పేరిట ఉంది. అక్కడి తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఈ గ్రంథాలయం పనిచేస్తోంది.
- మయన్మార్‌లో ఒక వీధికి అచ్చ తెలుగు పేరు ఉంది. మయన్మార్‌లోని నాలుగో అతిపెద్ద నగరమైన మాలమ్యీన్‌లోని ఉన్న ఆ వీధి పేరు 'మల్లెపూల దిబ్బ'
- మయన్మార్‌లో ప్రాచీన 'తైలాంగ్' నాగరికతలకు చెందినవారు ఇప్పటికీ తెలుగులోనే మాట్లాడుకుంటారు. వారి మూలాలు కృష్ణా– గోదావరి పరివాహక ప్రాంతాలకు చెందినవి. శతాబ్దాల కిందటే వారు ఇక్కడ నుంచి మయన్మార్‌కు





We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

వలసవెళ్లి స్థిరపడ్డారు.

- బైబిల్‌ను తెలుగులోకి అనువదించిన రచయిత ఏ తెలుగు పండితుడో కాదు. బెంజమిన్ షుల్గే అనే పోర్చుగ్రీసు మతగురువు తొలిసారిగా బైబిల్‌ను తెలుగులోకి అనువదించారు.
- 'తెలంగాణా' అనే మాటను తొలిసారిగా ఉపయోగించిన ప్రాచీనుడు బహుశ శ్రీకృష్ణదేవరాయలే! 'తెలుగు తరలించిన దేశంబు తెలంగాణ్యము' అని అన్నాడాయన.
- శ్రీలంకలోని జిప్సీ తెగకు చెందిన వారిలో ఎక్కువమంది నేటికీ తెలుగులోనే మాట్లాడతారు.
- మారిషస్‌లో రేడియో, టీవిలలో తెలుగు కార్యక్రమాలు ప్రసారమవుతాయి.
- తెలుగులో దాదాపు ముప్పయి మాండలికాలు వాడుకలో ఉన్నాయి.

## భాష చదివికిపోతే ఆ భాషా సౌందర్యాలు చివికిపోతాయ్

గడచిన ఐదు దశాబ్దాల కాలంలో భారతదేశంలో 250కి పైగా భాషలు అంతరించిపోయాయని పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా (పీఎల్ఎస్ఐ) సర్వేలో తేలింది. 20 ఏళ్ళకు పైగా శ్రమించి తయారు చేసిన నివేదికలో పీఎల్ఎస్ఐ ఈ వివరాలను వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో 780కి పైగా భాషలు మనుగడలో ఉన్నాయి. మరో 50 ఏళ్లలో ఇందులో సగానికి పైగా భాషలు కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం ఉందని పీఎల్ఎస్ఐ హెచ్చరిస్తోంది.

ఒక భాష అంతరించిపోవడం అంటే ఆ భాషతో ముడిపడి ఉన్న సంస్కృతీ సంప్రదాయాలు, సాహిత్యం జనం మరుగనపడిపోవడమే! ఒక్క మాటలో చెప్పాలంటే భవిష్యత్ తరానికి చెప్పుకోవడానికి ఆ భాషా చరిత్ర లేకపోవడమే!

ఈ అంతరించిపోయే ప్రమాదమున్న భాషల్లో తెలుగు లేకపోవడం సంతోషకరమైన విషయం. అయితే ప్రమాదం లేకపోయినంత మాత్రాన తెలుగు ఎప్పటికీ ఇలా వర్ధిల్లుతుందని చెప్పుకోవడానికి లేదు. భాషాభివృద్ధికి ప్రతీ తెలుగువాడూ కృషి చేయాలి.

### భాషా గణాంకాలు..

**ప్రపంచ వ్యాప్తంగా మనుగడలో ఉన్న భాషలు 6500**
**ప్రపంచ వ్యాప్తంగా తెలుగు మాట్లాడేవారు 9.2 కోట్లు**
**ప్రపంచ భాషల్లో తెలుగుస్థానం 17**
**(మాండరిన్-1, ఇంగ్లీష్-1, హిందీ-3)**
**భారతీయ భాషల్లో తెలుగుస్థానం 3 (హిందీ-1, బెంగాలీ-2)**
**తెలుగు మాధ్యమంలో ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న బాలలు : 22శాతం**
**గూగుల్ సెర్చ్‌లో గత పదేళ్లుగా తెలుగుభాష 3, 4 స్థానాల్లో ఉంటోంది.**

తెలుగంటే తల్లి (అమ్మ) భాష.




'అమ్మ'తో మొదలైన భాష అమాయకంగా, అందంగా ఇష్టంగా మనతోపాటే పెరిగిన భాష.

ఎన్నెన్ని భాషలు నేర్చుకున్నా, టెక్నాలజీ ఎంతెంత దూసుకెళ్లినా, ప్రపంచంతో పోటీపడేందుకు పరాయిభాషను పూర్తిగా అందిపుచ్చుకున్నా... అమ్మభాషను కలుపుకుని మాట్లాడినంత ఇష్టంగా మరో భాషలో మాట్లాడలేం. మరో భాషను నేర్చుకోలేం!

అమ్మను ప్రేమించడం ఎప్పుడూ తగ్గదు. తగ్గలేదు. తగ్గనివ్వకూడదు!

ఎంత బాగుందీ అమ్మను, అమ్మ భాషను ప్రేమించడం! అలా ప్రేమిస్తూనే ఎప్పటికీ ఉందాం, తెలుగు ఎప్పటికీ బతికేలా ఉందాం!!

## తెలుగు భాష మృత భాష కాబోదు! అమృత భాషగా రాణిస్తుంది

భారతదేశంపై ముస్లిముల దండయాత్రలు క్రీస్తు శకం పన్నెండో శతాబ్ది నుంచే మొదలైనా, తెలుగునేలపై వారి ప్రభావం వెనువెంటనే పడలేదు. పద్నాలుగో శతాబ్దిలో తుగ్లక్ వంశీయుల పాలన మొదలైనప్పుడు దక్కను పీఠభూమి సుల్తానుల పాలనలోకి వచ్చింది. పదిహేడో శతాబ్దిలో మొఘల్ వంశీయుల హయాంలో దక్షిణాదిన సుల్తానుల ప్రాబల్యం మరింత పెరిగింది. సుల్తానుల ఏలుబడిలో నలిగిన తెలుగు ప్రాంతాల్లో తెలుగు భాషపై అరబ్బీ, పారశీక భాషల ప్రభావం మొదలైంది. ఇక నిజాముల ఏలుబడిలో హైదరాబాద్ రాజ్యంలో ఉర్దూ అధికార భాషగా ఉండేది. రాజ్యంలోని అత్యధికులు తెలుగువారే అయినా, నిర్బంధంగా ఉర్దూ చదువుకునేవారు. సుల్తానుల పాలన సుదీర్ఘ కాలం కొనసాగిన తెలుగు ప్రాంతాల్లో అరబ్బీ, పారశీ, ఉర్దూ భాషల ప్రభావంతో విభిన్నమైన మాండలికాలు ఏర్పడ్డాయి. నిజాముల హయాంలోనే తెలంగాణ ప్రాంతంలో తెలుగుభాష పరిరక్షణ కోసం, కొమర్రాజు వెంకట లక్ష్మణరావు, మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి వంటివారు తమ వంతు కృషి కొనసాగించారు. బ్రిటిష్ పాలన మొదలయ్యాక దేశమంతటా ఇంగ్లీష్ ప్రభావం పెరిగింది. తెలుగులోకి అనివార్యంగా ఇంగ్లీష్ పదాలు వచ్చి చేరాయి. నిజాముల హయాంలోని హైదరాబాద్ ప్రాంతంతప్ప మిగిలిన తెలుగు ప్రాంతమంతా మద్రాసు ప్రావిన్స్‌లో భాగంగా ఉండేది. ఇంగ్లీష్ చదువుల ప్రభావంతో తెలుగుభాష ఆధునికతను సంతరించుకుంది. ఇలా ఇలా యిప్పటికీ తెలుగు భాసిల్లుతూనే ఉన్నది.

# గంగి గోవు పాలు గరిటెడు చాలు



**"దశవర్ష సహస్రాణి దశవర్షశతానిచ" అని బాల (1-97) యుద్ధ (131-10) కాండములలో వున్నది. ఈ ప్రామాణిక వాక్యాన్ని ఆసరాగా తీసుకొని ఎంతోమంది మేధావులు రాముడు 11,000 సం॥లు రాజ్యపాలన కొనసాగించినట్లుగా ప్రచారం చేశారు.**

**తృతీయం శతమిత్యాహుః చతుర్థంతు సహస్రకం... అనే ప్రాచీన సంఖ్యా శాస్త్ర సూత్రాన్ని అనుసరించి, 'శత' అనగా 3 అని, 'సహస్ర' అంటే 4 అనే అర్థం వస్తున్నది. అంటే 'దశసహస్రవర్షం' అనగా 40 సంవత్సరాలని, 'దశవర్షశతం' అనగా 30 సంవత్సరములని తెలుతున్నది. మొత్తం కలిపితే 40 + 30 = 70 సంవత్సరాలు. అరణ్యవాసం రావణయుద్ధం ఇవి అయ్యేనాటికి శ్రీరామునికి 38 సం॥రాల వయస్సు గడిచిపోయింది. అంటే 70 + 38 = 108 సం॥లు అన్నమాట. ఒక మనిషి పూర్ణాయుర్దాయం 108 సం॥లు అన్నమాట. ఒక మనిషి పూర్ణాయుర్దాయం 108 సం॥లు. ఆ యుగంలో సంభవమే కనుక శ్రీరాముడు సింహాసనంపై వుండి, రాజ్యం చేసింది 70 సం॥లు మాత్రమేనని తెలుస్తున్నది.**

**ఇదంతా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే, ఒక సాధారణ చక్రవర్తి 11 వేల సంవత్సరాల్లో ప్రజలకు ఎంత వృద్ధి - సుఖాలను ఇవ్వగలడో, అన్ని వేల సంవత్సరాల సుఖ-సంతోషాలను శ్రీరాముడు తన ప్రజలకు కేవలం తన 70 సం॥ల పాలనలో ఇవ్వగల్గినాడని చెప్పడానికే!**